ప్రజాశక్తి

శుక్రవారం 4 జులై 2025

8 పేజీలు

గుంటూరు

పల్నాడు

జెడ్‌పి భేటీపై ఉత్కంఠ!

- నేడు సర్వసభ్య సమావేశం
- 13 శాఖలపై చర్చకు అవకాశం
- టిడిపి తీరు పరిశీలించాకే మా నిర్ణయం : వైసిపి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లాప్రతినిధి

ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం జెడ్‌పి సమావేశ మందిరంలో శుక్రవారం జరగనుంది. మూడు జిల్లాలకు చెందిన ప్రజా ప్రతినిధులు, అధికారులు, కలెక్టర్లు, జెడ్‌పిటిసిలు, ఎంపిపిలు హాజరు కానున్న ఈ సమావేశంపై ఉత్కంఠ నెలకొంది. చైర్‌పర్సన్ హెనీ క్రిస్టినా అధ్యక్షతన జరిగే సమావేశం ఉదయం 10.30 గంటలకు ప్రారంభమై మధ్యాహ్నం వరకు జరిగే అవకాశం ఉంది. గత ఆరు నెలలుగా సమావేశం జరగక పాలనపరంగా ప్రతిష్టంభన నెలకొంది. సర్వసభ్య సమావేశం నిర్వహించి అనుమతి పొందకపోవడం వల్ల పలు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. అయితే చైర్‌పర్సన్ హెనీ క్రిస్టినా సభ ఆమోదం లేకుండా నిధులు ఖర్చు పెట్టి తరువాత సమావేశంలో ప్రవేశపెట్టి ఆమోదం కోసం ప్రయత్నిస్తున్నారని వైసిపి సభ్యులు ఆరోపిస్తున్నారు. ఈ అంశంపైనే చైర్‌పర్సన్‌పై వ్యతిరేకత తెలియజేస్తూ గత మార్చి 15న జరిగిన జిల్లా పరిషత్ సమావేశాన్ని వైసిపి జెడ్‌పిటిసిలు బహిష్కరించారు. దీంతో కోరం లేక మార్చి 15న సమావేశం జరగలేదు. ఆ తరువాత ఇప్పటి వరకు సర్వసభ్య సమావేశం జరగలేదు.

శుక్రవారం జరిగే సమావేశం ప్రశాంతంగా జరగుతుందా లేదా వాయిదా పడుతుందా అనే అంశంపై సందిగ్ధం నెలకొంది. చైర్‌పర్సన్, టిడిపి ప్రజా ప్రతినిధుల తీరుపైనే తమ నిర్ణయం ఉంటుందని వైసిపి నాయకుడు, రొంపిచర్ల జెడ్‌పిటిసి ఓబులరెడ్డి అన్నారు. మరోవైపు జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో 13 శాఖలకు సంబంధించిన అంశాలపై చర్చిస్తారని ఏజెండాలో పేర్కొన్నారు. జలవనరుల శాఖ, నాగార్జున సాగర్ కాల్వలు, చిన్ననీటి పారుదల, జలవనరుల అభివృద్ధి కార్పొరేషన్, వ్యవసాయం, అనుబంధ శాఖలు, వైద్య ఆరోగ్యం, ఎన్‌టిఆర్ వైద్య సేవలు (ఆరోగ్యశ్రీ), విద్య, వయోజన విద్యాశాఖ, గ్రామపంచాయతి శాఖ, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్, గ్రామీణ నీటిపారుదుల శాఖ, జిల్లా నీటి యాజమాన్య శాఖ, ఉపాధి హామీ పథకాలు, గృహ నిర్మాణంపై పురోగతి, స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖ, పౌరసరఫరాలు, పరిశ్రమలు, మహిళా శిశు సంక్షేమ శాఖలపై చర్చ జరుగుతుందని ఏజెండాలో పేర్కొన్నారు. సమావేశం పూర్తిస్థాయిలో జరిగితే వివిధ అంశాలపై సుదీర్ఘ చర్చ జరుగుతుందని అధికార వర్గాలు చెబుతున్నారు.

సాగర్ కాల్వలకు నీటి విడుదల, గతేడాది ఎదురయిన వరద పరిస్థితులపై చర్చ జరిగే అవకాశం ఉంది. ఈ ఏడాది ఏ పంటకు మద్దతు ధరలు లభించలేదని మిర్చి, పొగాకు, బర్లీ పొగాకు, అపరాల ధరలు గణనీయంగా తగ్గడం వల్ల ఒక్కొక్కరికి సగటున ఎకరాకు రూ.లక్ష వరకు నష్టం వచ్చిందని రైతులు వాపోతున్నారు. వరి, పత్తి దిగుబడులు కూడా కనీస మద్ధతు ధర రాక రైతులు ఇబ్బంది పడ్డారు. ఇప్పటికే ఖరీఫ్ సీజన్ ప్రారంభమై దాదాపు నెల పూర్తయినా వ్యవసాయ శాఖ అధికారులు ▶ 2లో

బేజాత్‌పురం గ్రామ సభలో భూసమీకరణకు అభ్యంతరం చెబుతున్న రైతులు

మా భూములను ఇవ్వం

- రాజధానికి మరోసారి భూమి సమీకరణపై రైతుల వ్యతిరేకత
- ఇచ్చిన వరకే తీసుకుంటామన్న ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్
- తాడికొండ మండలంలోని పలు గ్రామాల్లో సభలు

ప్రజాశక్తి - తాడికొండ

రాజధానికి మళ్లీ భూ సమీకరణపై బేజాత్‌పురం గ్రామంలో గురువారం నిర్వహించిన గ్రామ సభలో టిడిపి నాయకులు, రైతుల మధ్య వ్వాగ్వాదం తలెత్తింది. గురువారం మండలంలోని పాములపాడు, బేజాత్‌పురం, రావెల గ్రామాల్లో సభలు నిర్వహించగా ఎమ్మెల్యే తెనాలి శ్రవణ కుమార్, రెవెన్యూ అధికారులు హాజరయ్యఆరు. భూ సమీకరణను బేజాత్‌పురం సభలో రైతులు వ్యతిరేకించారు. గతంలో తుళ్లూరు మండలంలో ఇచ్చిన భూములు నేటికీ అభివృద్ధికి నోచుకోలేదని, మళ్లీ కొత్తగా సమీకరణ ఏమిటని నిలదీశారు. దీనిపై రైతులతో టిడిపి నాయకులు వాగ్వాదానికి దిగారు. దూషణలు, తోపులాట స్థాయికి పరిస్థితి చేరగా పోలీసుల జోక్యంతో సర్దుమణిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ భూ సమీకరణ, సేకరణ మధ్య ఉన్న వ్యత్యాసాన్ని ▶ 2లో

9న సమ్మెను జయప్రదం చేయండి

ప్రజా సంఘాల పిలుపు

2 లో

రెండో విడత భూసమీకరణ వద్దు

2 లో

పలు గ్రామాల్లో రైతుసంఘం సమావేశాలు

నేటి నుంచి శ్రీకాళహస్తి మార్గంలో రైళ్లు

తొలిసారిగా నాంథేడ్-తిరుపతికి అనుమతి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

నడికుడి-శ్రీకాళహస్తి నూతన రైలు మార్గంలో శుక్రవారం నుంచి రైళ్ల రాకపోకలను పాక్షికంగా ప్రారంభించనున్నారు. ఈ మార్గంలో పల్నాడు జిల్లాలో వినుకొండ వరకు రైల్వే ట్రాక్ పనులు పూర్తయ్యాయి. పల్నాడు జిల్లా రొంపిచర్ల రైల్వే స్టేషన్ మీదుగా తొలి రైలు ప్రారంభం కానుంది. గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలోని నెమలపురి, రొంపిచర్ల రైల్వే స్టేషన్లలో టికెట్ల విక్రయ కేంద్రాలను రైల్వే శాఖ ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ రైలు వారానికి ఒకసారి నడుస్తుందని అధికారులు తెలిపారు. 2010-11లో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఈ రైల్వే లైను పనులు ప్రారంభించారు. తొలిదశలో పిడుగురాళ్ల నుంచి శావల్యాపురం వరకు ట్రాక్ నిర్మించారు. ఇప్పటికే గూడ్స సర్వీసులు కొనసాగిస్తున్నారు. శుక్రవారం నుంచి తొలిసారిగా నాంథేడ్ నుంచి తిరుపతికి రైలును ఈ మార్గంలో నడపనున్నారు. న్యూ పిడుగురాళ్ల నుంచి శావల్యాపురం వరకు కొత్త లైనులో నడుపుతారు. శావల్యాపురం వద్ద పాత గోవా లైను వరకు ఈ లైనును అనుసంధానం చేస్తారు. దీంతో నాంథేడ్ తిరుపతి రైలు నంబరు 07189తో రైలును నడపనున్నారు. తిరుపతి నుంచి నాంథేడ్‌కు కూడా ప్రతి శనివారం రైలును నడపనున్నారు. న్యూ పిడుగురాళ్ల నుంచి నెమలిపురి, రొంపిచర్ల, శ్యావల్యాపురం,వినుకొండ, దొనకొండ, మార్కాపురం, గిద్దలూరు, నంద్యాల, కడప, రాజంపేట, రేణిగుంట మీదుగా తిరుపతికి నడుపుతారు. తొలిసారిగా శ్రీకాళహస్తి మార్గంలో ఈ రైలుతో అధికారులు రాకపోకలకు శ్రీకారం చుడుతున్నారు.

మాయం కానున్న డొంక రోడ్డు

ప్రజాశక్తి- తాడేపల్లి

రాజధాని అమరావతి చుట్టుపక్కల ఉన్న తాడేపల్లి మంగళగిరి తదితర ప్రాంతాల్లో భూముల ధరలు ఒక్కసారిగా రెక్కలు వచ్చాయి. గజం భూమి రూ.వేలల్లో పలుకుతోంది. ఈ నేపథ్యంలో డబ్బు సంపాదనకు అధికార పార్టీ నేతలు పోటీ పడుతున్నారు. తాడేపల్లి పట్టణం పాత ఐఒసి కార్యాలయం వెనుక పొలాలకు వెళ్లే డొంకను రియల్ ఎస్టేట్ వ్యక్తికి కట్టబెట్టడానికి రంగం సిద్ధమైంది. ఇక్కడ ఏళ్ల తరబడి సుమారు 36 మంది రైతులు 96 ఎకరాలను సాగు చేస్తున్నారు.

రూ.కోట్ల భూమి రియల్ ఎస్టేట్ పాలు

ఇందులో గేటెడ్ కమ్యూనిటీ నిర్మాణానికి తణుకు ఎమ్మెల్యే సోదరుడు ముందుకొచ్చారు. ఇక్కడున్న భూమిలో ముగ్గురు రైతుల మినహా మిగతావారంతా తమ 80 ఎకరాలను విల్లాల అభివృద్ధికి అప్పగించారు. ఇందుకు ఒక్కో రైతుకు ఎకరానికి రూ.25 లక్షలు అడ్వాన్స్ ఇచ్చారు. ప్రస్తుతం ఇక్కడ భూమి విలువ మార్కెట్ ధర ప్రకారం రూ.2.5 కోట్ల నుండి రూ.2.8 కోట్ల వరకు ఉంది. ▶ 2లో

కృష్ణా నదిలో పెరిగిన జలరవాణ

తెలంగాణకూ పడవలు, బల్లకట్టు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లాప్రతినిధి

గుంటూరు, పల్నాడు జిల్లాల నుంచి తెలంగాణకు జలరవాణా సౌలభ్యం పెరిగింది. గుంటూరు, పల్నాడు జిల్లాల మీదుగా ఎన్‌టిఆర్ జిల్లా నుంచి తెలంగాణ ప్రాంతానికి కృష్ణానదిలో పడవులు, బలకట్ల ద్వారా రవాణాను ఆయా ప్రాంతాల వాసులు వినియోగించుకుంటున్నారు. కేవలం 9 నెలల కాలపరిమితికి టెండర్లు ఖరారు చేశారు. ఇందుకు సంబంధించి ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్‌తో గురువారం నిర్వహించిన పడవలు, బలకట్ల వేలంలో టెండర్లను ఖరారు చేశారు. పల్నాడు జిల్లా అచ్చంపేట మండలం చింతపల్లి నుంచి పడవ ద్వారా ఎన్‌టిఆర్ జిల్లా ఇస్తేపల్లికి రవాణను కొనసాగించేందుకు ఎం.జనార్ధనరావు రూ.2.20 లక్షల రుసుంతో టెండరు దక్కించుకున్నారు. అచ్చంపేట మండలం గింజుపల్లి నుంచి వేదాద్రికి పడవ ప్రయాణం కోసం రూ.3.50 లక్షల రుసుంతో కె.శ్రీనివాసరావు కాంట్రాక్టు దక్కించుకున్నారు. అచ్చంపేట మండలం మాదిపాడు నుంచి తెలంగాణలోని సూర్యాపేట జిల్లా బుగ్గమదారం రేవు వరకు బలకట్టు నిర్వహణకు కె.సతీష్ అనే కాంట్రాక్టరు రూ.4.50 లక్షలతో కాంట్రాక్టు పొందారు. అయితే ఆప్‌సెట్ ప్రైస్ రూ.7.75 లక్షలుగా నిర్ధారించగా తక్కువ రేటుకు కాంట్రాక్టు పొందారు. మాచవరం మండలం గోవిందాపురం నుంచి సూర్యాపేట జిల్లా చింతిర్యాల రేవుకు బల్లకట్టు ▶ 2లో

జెడ్‌పి భేటీపై ఉత్కంఠ!

(మొదటిపేజీ తరువాయి)

ఇంత వరకు రైతులకు దిశా నిర్దేశం చేయలేదు. ఖరీఫ్ కార్యాచరణ ప్రకటించలేదు. ప్రభుత్వం సంక్షేమ పథకాలు చాలా మంది అందలేదు. తల్లికి వందనం ఖాతాల్లో సొమ్ములు జమకాని వారు ఎవరిని సంప్రదించాలో తెలియని పరిస్థితుల్లో తల్లిదండ్రులున్నారు. కేవలం సచివాలయాల్లో గ్రీవెన్సుల్లో దరఖాస్తు చేసుకోవాలన్నారే కానీ దీనిపై విచారణకు ఎవ్వరూ రాలేదని పలువురు తల్లులు వాపోతున్నారు. గృహ నిర్మాణం పెండింగ్‌లో పడింది. జగనన్న కాలనీల్లో నిర్మాణాలు ఇప్పటికే పెండింగ్‌లో ఉన్నాయి. చాలాచోట్ల స్థలాలు ఎందుకు ఉపయోగపడని స్థితిలో ఉన్నాయి. ఇలా శాఖ లవారీగా సమావేశంలో చర్చ జరిగే అవకాశం ఉంది.

మా భూములను ఇవ్వం

(మొదటిపేజీ తరువాయి)

వివరించారు. భూ సమీకరణ వల్ల ప్రయోజనమని చెప్పారు. రాజధానులోకి పెట్టుబడులు పెట్టడానికి అనేక సంస్థలు ముందుకు వస్తున్నాయని, వాటికి భూముల అవసరం ఏర్పడిందని అన్నారు. ఎవర్నీ బలవంతం చేయబోమని, ఇష్టమైతేనే భూములివ్వాలని, ఇచ్చిన భూములతోనే సరిపెట్టుకుంటామని అన్నారు. అభిప్రాయాన్ని స్పష్టంగా చెప్పొచ్చన్నారు. ఇదిలా ఉండగా కొందరు ఇవ్వబోమని చెప్పగా, మరికొందరు భూములు ఇవ్వడానికి అంగీకారం తెలిపారు. రాజధానిలో వస్తున్న విద్యా సంస్థల్లో తమ పిల్లలకు విద్యా, ఉద్యోగ అవకాశాలు కల్పించాలని పలువురు రైతులు కోరారు. సభల్లో ఆర్‌డిఒ శ్రీనివాసరావు, తహసీల్దార్ మెహర్ కుమార్ పాల్గొన్నారు.

కృష్ణా నదిలో పెరిగిన జలరవాణ

(మొదటిపేజీ తరువాయి)

నిర్వహణకు కాంట్రాక్టర్లు ఎవ్వరూ ముందుకు రాలేదు. అమరావతి మండలం దిడుగు నుంచి కృష్ణా జిల్లా ఏటూరు వరకు పడవ నడుపుకునేందుకు బి.రఘురామయ్య 9నెలల కాలపరిమితికి రూ.6 లక్షల రుసుముతో కాంట్రాక్టు దక్కించుకోగా కొల్లిపర మండలం వల్లభాపురం నుంచి కృష్ణాజిల్లా వల్లూరుపాలేనికి పడవ నడిపేందుకు వేలం దారులు ఎవ్వరూ రాలేదని అధికార వర్గాలు తెలిపాయి.

మాయం కానున్న డొంక రోడ్డు

(మొదటిపేజీ తరువాయి)

రిజిస్టర్ ప్రభుత్వ ధర రూ.80 లక్షల నుండి రూ.కోటి వరకు ఉంది. రైతులు పొలాలకు వెళ్లడానికి వీలుగా డొంక రోడ్డు ఐదారు వంకర్లు తిరిగింది. తాము నిర్మించే గేటెడ్ కమ్యూనిటీ, విల్లాలోకి వెళ్లేందుకు సరాసరి రోడ్డు నిర్మించడానికి బిల్డర్ నిర్ణయించాడు. అనుకున్నదే తడవుగా తహశీల్దార్‌ను ఒప్పించినట్లు రైతులు చెబుతున్నారు. డొంక రోడ్డుపై ఏమైనా అభ్యంతరాలుంటే తెలపాలని తహశీల్దార్ ప్రకటనిచ్చారు. ఈ వివరాలను ఎమ్‌టిఎంసి కార్యాలయం, తహశీల్దార్ కార్యాలయం, సచివాలయాల్లోని నోటీసు బోర్డుల్లో ఉంచారు. రైతుల డొంకకు సంబంధించి భూమి ఇప్పటి మార్కెట్ ధర ప్రకారం రూ.కోట్ల రూపాయలున్నా నామమాత్రపు ధరకు ఎమ్మెల్యే సోదరుడికి కట్టబెట్టడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని రైతులు చెబుతున్నారు. అదే జరిగితే భూములివ్వని రైతులు తమ పొలాలకు వెళ్లటానికి దారే ఉండదని అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్, జెసి, తహశీల్దార్, ఎమ్‌టిఎంసి అధికారులకు వినతులిచ్చారు. సిపిఎం నాయకుల దృష్టికి ఈ విషయం రావడంతో వారు వివరాలు సేకరిస్తున్నారు. డొంకరోడ్డును యథావిధిగా ఉంచాలని మంత్రి నారా లోకేష్ దృష్టి తీసుకెళ్లాలని కొంతమంది రైతులు భావిస్తున్నారు. కోట్ల విలువ చేసే భూమిని రియల్ ఎస్టేట్‌కు ఎలా కట్టబెడతారని ప్రశ్నిస్తున్నారు. ఇదిలా ఉండగా ఎమ్మెల్యే సోదరుడు రోడ్డు రోలర్‌తో చకచకా పనులు చేయిస్తున్నారు.

9న సమ్మెను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - పెదనందిపాడు

మాట్లాడుతున్న పాశం రామారావు

కేంద్ర ప్రభుత్వ కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను ఉపసంహరించుకోవాలని దేశవ్యాప్తంగా కార్మిక, రైతు సంఘాల పిలుపు మేరకు 9న జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షులు రామారావు పిలుపునిచ్చారు. స్థానిక తేళ్ల నారాయణ విజ్ఞాన కేంద్రంలో గురువారం జరిగిన ప్రజాసంఘాల సమావేశానికి రైతుసంఘం జిల్లా సహాయ కార్యదర్శి కె.వెంకట శివరావు అధ్యక్షత వహించారు. రామారావు మాట్లాడుతూ బిజెపి పాలనలో కార్మికులు, రైతులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని, కార్మికులు పోరాడి సాధించుకున్న ఎనిమిది గంటల పని విధానాన్ని తొలగించి 12 గంటల పని విధానాన్ని అమలు చేస్తున్నారని అన్నారు. కార్మిక హక్కులను కాలరాసి, పెట్టుబడుదారులకు అనుకూలంగా చట్టాలు చేస్తున్నారని, 44 కార్మిక చట్టాలను నాలుగు కోడ్ లుగా కుదించి చట్టాలను మారుస్తున్నారని విమర్శించారు. స్కీం వర్కర్లకు అతితక్కువ వేతనాలను అందిస్తున్నారని, సుప్రీంకోర్టు తీర్పు మేరకు రూ.26 వేల రూపాయల కనీస వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ రంగ సంస్థలను కారు చౌకగా కార్పొరేట్లకు కట్టబెడుతున్నారని, దేశ సంపదను ఆదాని, అంబానీ లాంటి కొద్దిమంది వ్యక్తులకు దోచి పెడుతున్నారని విమర్శించారు. మత తత్వాన్ని రెచ్చగొడుతూ ప్రజల మధ్య చీలికలను తెస్తు న్నారని, రాజ్యాంగాన్ని మార్చివేసి, సనాతన ధర్మం పేరిట అరాచకాన్ని ప్రోత్సహిస్తున్నారని, లౌకిక విలువలకు తూట్లు పొడుతున్నారని మండిపడ్డారు. దేశంలో 60 శాతం మంది ఆధారపడ్డ వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్లకు అప్ప జెప్పడానికి యత్నిస్తున్నారని, కనీస మద్దతు ధరల చట్టం హామీని అమలు చేయలేదని అన్నారు. ఎంఎస్ స్వామినాథన్ సిఫారసులను అమలు చేయాలని, సమగ్ర పంటల బీమా పథకం ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. అన్నదాత సుఖీభవ పథకాన్ని వెంటనే అమలు చేయాలని, కౌలు రైతులకు గుర్తింపు కార్డులిచ్చి పంట రుణాలు మంజూరు చేయాలని, వారికే ప్రభుత్వ పథకాలను వర్తింపజేయాలని కోరారు. ఉపాధి హామీ కూలీలకు కనీస వేతనం రూ.600 ఇవ్వాలని, వందరోజుల పని దినాలు కల్పించాలని కోరారు. ఈ డిమాండ్ల సాధన కోసం జరిగే సమ్మెలో అన్ని రంగాల ప్రజలు పాల్గొనాలని కోరారు. శ్రామిక మహిళ జిల్లా కార్యదర్శి జి.రమణ మాట్లాడుతూ స్కీం వర్కర్లకు సరైన జీతాల్లేవని, మహిళల శ్రమను దోచుకుంటున్నారని అన్నారు. పెన్షన్, గ్రాడ్యుటీలను కల్పించడం లేదన్నారు. మధ్యాహ్న భోజన కార్మికులకు, ఆశాలకు అనేక నెలలుగా జీతాలు అందక ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. మహిళల మీద అఘాయిత్యాలు పెరిగిపోయాయన్నారు. సిఐటియు నాయకులు డి.రమేష్‌బాబు సమ్మెలో కార్మికులంతా పాల్గొనాలన్నారు. అనంతరం ప్రజాశక్తి ప్రచురించిన ప్రత్యేక సంచికను రామారావు, ఇతర నాయకులు ఆవిష్కరించారు. జె.రామారావు, జి.రమేష్, డి.శ్రీనివాసరావు, ఎం.వెంకటేశ్వర్లు, పి.సుధీర్, బి.శంకరయ్య, ఎన్.రాజేంద్ర, పి.భువనేశ్వరి, ఎం.లక్ష్మి, షేక్ షమీ, శివపార్వతి, పి.సరళాదేవి, పి.రాణి పాల్గొన్నారు.

రెండో విడత భూసమీకరణ వద్దు

తొలుత కేటాయించిన రాజధాని ప్లాట్లను అభివృద్ధి పరిచి రైతులకు అందించాలి

పలు గ్రామాల్లో రైతులతో సమావేశంలో రైతుసంఘం డిమాండ్

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్, తాడికొండ

రాజధానికి ల్యాండ్ పూలింగ్ పేరుతో మరోసారి 44 వేల ఎకరాలను సేకరించాలనే ప్రభుత్వ నిర్ణయం సరికాదని రైతుసంఘం నాయకులు అన్నారు. ఈ అంశంపై మండలంలోని కాజ గ్రామంలో రైతులతో సమావేశమయ్యారు. సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు జొన్న శివశంకరరావు, కె.అజయ్‌కుమార్ మాట్లాడుతూ గతంలో 33 వేల ఎకరాల తీసుకున్నారని, కేటాయించిన ప్లాట్లు రైతులకు అభివృద్ధి చేసే ఇస్తామని చెప్పినా ఇప్పటికీ ఇవ్వలేదని అన్నారు. ప్రభుత్వం మరోసారి భూసమీకరణ అనడంతో రాజధానిలో ప్లాట్ల ధరలు పడిపోయాయని, గజం రూ.45 వేలకు పలికిన భూములు నేడు రూ.25 వేలకైనా కొనే పరిస్థితి లేదని చెప్పారు. రెండో విడత ల్యాండ్ పూలింగ్ కోసం జరుగుతున్న గ్రామ సభల్లో అనేకమంది రైతులు తమ భూములు తీసుకోవడాన్ని వ్యతిరేకిస్తున్నారని గుర్తు చేశారు. అయితే రైతులను బెదిరిస్తున్న సంఘటనలు అక్కడక్కడా కనిపిస్తున్నాయని చెప్పారు. టిడిపి నేతలు అధికారం ఉన్న చోట చిన్న కారు రైతులు మాట్లాడనివ్వడం లేదన్నారు. రైతు సంఘం నాయకులు ఈశ్వర్‌రెడ్డి, మాజీ ఎంపిటిసి ఈదా ప్రతాపరెడ్డి మాట్లాడుతూ గతలో 33వేల ఎకరాలు తీసుకునే క్రమంలో తొలుత పెనుమాక, ఉండవల్లి లేదని చెప్పి మళ్లీ వాటిని కూడా తీసుకున్నారని, కాజాలోనూ ఆ ప్రమాదం లేకపోలేదని అన్నారు. తమ భూములు తీసుకోవడానికి అంగీకరించబోమని పలువురు రైతులు ఈ సందర్భంగా చెప్పారు.

తాడికొండ మండలం కంతేరు, తాడికొండ, పెదపరిమి గ్రామాల్లోనూ రైతులతో సంఘం నాయకులు పలుచోట్ల సమావేశ మయ్యారు. రెండో విడత భూ సమీకరణకు భూము లిస్తారా? అని రైతులను నాయకులు అడుగగా లేదని వారు చెప్పారు.

తాడికొండలో మాట్లాడుతున్న రైతు సంఘం నాయకులు

గతంలో తీసుకున్నవాటికే గతి లేదని, మళ్లీ ఇప్పుడు ఏ ముఖం అడుగుతోందని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం రియలెస్టేట్ వ్యాపారం చేస్తోందని విమర్శించారు. అయితే ఒక్కొక్కసారి ఒక్కొక్క నోటిఫికేషన్ విడుదల చేసి ఒకసారి చెప్పిన గ్రామాల భూములు మరొక్కసారి చెప్పకుండా రైతులను అయోమయానికి గురి చేస్తున్నారని అన్నారు. అయితే రైతులు భూమి లివ్వడానికి సిద్ధంగా ఉన్నారంటూ వస్తున్న తప్పుడు వార్తలను నమ్మొద్దన్నారు. గతంలో భూములివ్వడంతో రైతులతోపాటు కౌలురైతులు, కూలీలు పడుతున్న ఆర్థిక ఇబ్బందులను గుర్తు చేశారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ రైతుల అభియిప్రాయానికి భిన్నంగా ప్రభుత్వం బలవంతపు భూమిని సమీకరిస్తే తగిన మూల్యం చెల్లించక తప్పదన్నారు. సమావేశాల్లో శివశంకర్, అజయ్‌కుమార్‌తోపాటు డి.వెంకటరెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, సిహెచ్ భాస్కరరావు, బి.శ్రీనివాసరావు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

మన్నవ సర్పంచ్‌పై హత్యాయత్నం

ప్రజాశక్తి-పొన్నూరు : పొన్నూరు మండలం మన్నవ గ్రామ సర్పంచ్ బొనిగల నాగమల్లేశ్వరరావు పై గుర్తు తెలియని దుండగులు గురువారం హత్యా ప్రయత్నం చేశారు. మన్నవ గ్రామం నుండి పొన్నూరు వస్తున్న నాగమల్లేశ్వరరావును కట్టెంపూడి అడ్డరోడ్డు వద్ద అటకాయించిన దుండగులు సర్పంచ్‌ను కొట్టి పరారయ్యారు. తలకు తీవ్రంగా గాయం కావడంతో స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు అక్కడికి చేరుకున్న పోలీసులు సర్పంచ్‌ని నిడుబ్రోలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలి చారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కొరకు గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పొన్నూరు రూరల్ సీఐ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

శాంతిభద్రతలు క్షీణిస్తున్నాయి

మన్నవ సర్పంచ్ నాగమల్లేశ్వరరావుకు వైసిపి నేతల పరామర్శ

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

కూటమిపాలనలో శాంతిభద్రతలు క్షీణిస్తున్నాయని మాజీ మంత్రి అంబటి రాంబాబు ఆరోపించారు. పొన్నూరు మండలం కట్టెంపూడి వద్ద మన్నవ సర్పంచి బొనిగల నాగమల్లేశ్వరరావుపై జరిగిన హత్యాప్రయత్నాన్ని ఆయన ఖండించారు. నాగమల్లేశ్వరరావు స్థానిక రమేష్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా గురువారం రాత్రి అంబటి రాంబాబుతో పాటు పలువురు నేతలు పరామర్శించారు. ఈ సందర్భంగా అంబటి మీడియాతో మాట్లాడుతూ వైసిపికి చెందిన బొనిగల నాగమల్లేశ్వరరావుపై పట్టపగలే టిడిపి వారు కొట్టి చంపే ప్రయత్నం చేశారన్నారు. తీవ్రంగా గాయపడ్డ నాగమల్లేశ్వరరావు పరిస్థితి విషమంగా ఉందన్నారు. నాగమల్లేశ్వరరావు కుటుంబానికి తమ పార్టీ అండగా ఉంటుందన్నారు. అంబటి వెంట ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, డిప్యూటీ మేయర్ డైమండ్‌బాబు, వైసిపి నాయకులు మోదుగుల వేణుగోపాలరెడ్డి, అంబటి మురళీకృష్ణ, రూత్ రాణి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి కార్యాలయంలో ఇంటర్నల్ కంట్రోల్ కమిటీ

ప్రజాశక్తి - తెనాలి

మహిళల భద్రత, సంక్షేమం కోసం ప్రతి కార్యాలయంలో ఇంటర్నల్ కంట్రోల్ కమిటీ ఉండాలని వన్ స్టాప్ సెంటర్ లీగల్ అడ్వైజర్ విజయలక్ష్మి చెప్పారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ కె.వి గోపాలకృష్ణ అధ్యక్షతన గురువారం రెవెన్యూ, వివిధ శాఖల ఉద్యోగులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళా రక్షణకు ఉన్న చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. గృహహింస, కట్నం వేధింపులు, మహిళలపై లైంగిక, మానసిక, శారీరక వేధింపులకు సంబంధించిన పలు చట్టాలు, హెల్ప్ లైన్ సెంటర్ల వివరాలను వెల్లడించారు. ప్రతి కార్యాలయంలో మహిళల రక్షణ కోసం ఇంటర్నల్ కంట్రోల్ కమిటీ నలుగురు సభ్యులతో ఏర్పాటు కావాలన్నారు.

వర్సిటీ విసి నియామకానికి సెర్చ్ కమిటీ ఏర్పాటు

ప్రజాశక్తి- ఎఎన్‌యు

ఆచార్య నాగార్జున యూనివర్సిటీ నూతన వైస్ ఛాన్సలర్ నియామకానికి సెర్చ్ కమిటీని నియమిస్తూ గురువారం ప్రభుత్వం జీవోను విడుదల చేసింది. సెర్చ్ కమిటీ సభ్యులుగా విజయవాడ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ మాజీ విసి సివి రావును, గీతం యూనివర్సిటీ మాజీ విసి ఆచార్య శివరామకృష్ణ, తమిళనాడుకు చెందిన ఆచార్య ఎస్ పంచనాదంలను నియమించారు. గత ఏడాది జులై 18 నుంచి వర్సిటీలో ఇన్చార్జి ఈజీగా ఆచార్య గంగాధర్‌రావు వ్యవహరిస్తున్నారు. ఈ నేపథ్యంలో నూతనంగా సెర్చ్ కమిటీ ప్రభుత్వం ఎట్టకేలకు నియమించింది. త్వరలోనే నాగార్జున యూనివర్సిటీ కి పూర్తిస్థాయి విసి నియామకం జరగనున్నది.

ముఖ్యమంత్రి ఇంటి సమీపంలో యోగా టీచర్ల నిరసన

ప్రజాశక్తి - తాడేపల్లి

ఉండవల్లిలోని అమరావతి కరకట్ట వద్ద ముఖ్యమంత్రి చంద్రబాబు నివాసం సమీపంలో గురువారం యోగా టీచర్లు నిరసనకు దిగారు. అనూహ్యంగా జరిగిన ఈ మెరుపు నిరసన సమాచారం అందుకున్న తాడేపల్లి పోలీసులు వారిని అరెస్ట్ చేసి తాడేపల్లి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా యోగా టీచర్లు మీడియాతో మాట్లాడుతూ గత ప్రభుత్వం నుండి ప్రభుత్వ విద్యా, ఆయుష్ శాఖ జీవో ప్రకారం పాఠశాలల్లో పనిచేస్తున్నాం అని చెప్పారు. మూడేళ్లుగా జీతాలు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కొద్దికాలం తర్వాత అయినా జీతాలు రాకపోతాయా అనే ఉద్దేశంతో యోగ టీచర్లుగా కొనసాగుతున్నామని చెప్పారు. అధికారుల చుట్టూ తిరిగినా ప్రయోజనం లేకపోయిందని కన్నీటి పర్యంతమయ్యారు. మొన్న జరిగిన యోగాంధ్ర కోసం సీఎం చంద్రబాబు నాయుడు ఎంతో భారీగా ఖర్చు పెట్టి, యోగా గురించి ప్రతి జిల్లాలో గ్రామాలలో తెలిసేలాగా నిర్వహించారని గుర్తు చేశారు. ఆ రోజు చంద్రబాబు మీడియాతో మాట్లాడుతూ ప్రతి స్కూల్ కి ఒక యోగా టీచర్ అవసరమని చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు. గత మూడు సంవత్సరాలుగా చేస్తున్న మాకు యోగా టీచర్లుగా అవకాశం కల్పించాలని, మా జీతభత్యాలు చెల్లించాలని, ఆంధ్రప్రదేశ్లో 907 స్కూళ్లలో 1054 మంది యోగ టీచర్లుగా పని చేస్తున్నామని,అందువల్ల మాకు యోగా టీచర్లుగా అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. సీఎం ఇంటి దగ్గర నుండి తాడేపల్లి పోలీస్ స్టేషన్ కు తీసుకొచ్చిన యోగా టీచర్లను సొంత పూచి కత్తు పై సాయంత్రం విడిచిపెట్టారు.

కారు ఢీకొని కార్మికుడు దుర్మరణం

ప్రజాశక్తి - మేడికొండూరు

రోడ్డుపై వెళ్తున్న వ్యక్తిని వెనుక వస్తున్న కారు ఢీకొనడంతో ఆ వ్యక్తి అక్కడికక్కడే దుర్మరణం చెందాడు ఈ సంఘటన మండలంలోని పేరేచర్ల గుంటూరు రోడ్డులోని చంద్రయ్య పెట్రోల్ బంకు వద్ద గురువారం రాత్రి జరిగింది. గుంటూరు రూరల్ మండలం వెంగళపాలెం గ్రామానికి చెందిన షేక్ నాగూర్ (45) తాపీ మేస్త్రిగా జీవనం కొనసాగిస్తున్నాడు. పని ముగించిన అనంతరం పెట్రోల్ బంకు వద్దకు వచ్చాడు.తన స్నేహితుడు పెట్రోల్ పట్టించేందుకు వెళ్లాడు. ఆ సమయంలో నాగూర్ బైక్ దిగి రోడ్డుపైనే ఉండగా పేరేచర్ల నుంచి వస్తున్న కారు నాగూర్‌బాషను వెనుకగా వచ్చి బలంగా ఢీకొట్టింది. మృతునికి భార్య మదర్ బి, ఇద్దరు పిల్లలు ఉన్నారు. జరిగిన ప్రమాద సంఘటనపై మేడికొండూరు పోలీసులు కేసు నమోదు దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ల్యాండ్ పత్రాలు పోయినవి

ఆముదాల చిన్న గంగాధరరావు s/o సీతరామయ్య పిడుగురాళ్ల టౌన్ కు చెందిన House document No. 1123/2005 పిడుగురాళ్ల సబ్‌రిజిస్టర్ ఆఫీసు వారిచే రిజిస్టర్ కాబడిన ల్యాండ్ పత్రాలు తీసుకొని ది.12-06-2025న చిన్న గంగాధరరావు గారు వారి ఇంటి నుండి పిడుగురాళ్ళ లోని ఎస్‌బిఐ బజార్‌బ్యాంక్‌కు వెళ్ళి పని చూసుకొని తిరిగి తన మోటార్ సైకిల్ పై ఇంటికి వచ్చుచుండగా ZPH School వద్దకు వచ్చు సరికి పైన తెల్పబడిన నా పత్రాలు మార్గమధ్యలో జారిపోయినవి. కావున మీకు ఎవరికైనా సదరు Document No. 1123/2005 పత్రాలు దొరికిన ఈ క్రింది ఫోన్ నెం. 7396500272 కి ఫోన్ చేసి సమాచారం ఇవ్వగలరు.

మహారాజశ్రీ పిడుగురాళ్ల సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో
O.S. No. 46/2024

Between:
కొల్లి వెంకటేశ్వర్లు. .... వాది
Vs,
చల్లగుండ్ల వెంకటరత్నం .... ప్రతివాది

ప్రతివాది :- చల్లగుండ్ల వెంకటరత్నం, తండ్రి సత్యనారాయణ, హిందువు, వయస్సు 47 సం"లు, వ్యవసాయం, అడ్రస్ R/o. కొత్తగణేసునిపాడు గ్రామం, మాచవరం మండలం, పల్నాడు, జిల్లా.

పై నెంబర్ గల దావా లో ప్రతివాదికి పై కోర్టు వారి ద్వారా పంపిన దావా సమన్లు తీసుకొనక కాలయాపన చేయుచున్నారు. కావున శ్రీ కోర్టు వారు సబ్‌స్టిట్యూట్ ఉత్తర్వుల ప్రకారము ది. 31-07-2025వ తేదీన ఉదయం 10-30 గం॥ లకు శ్రీ కోర్టువారి ఎదుట గాని న్యాయవాది ద్వారా గాని హాజరై మీ యొక్క ఆక్షేపణలు ఏమైనా ఉన్నచో తెలుపగలరు. లేనియెడల మీ పరోక్షమున తీర్మానం చేయబడును.
(ఈ నోటీసు కోర్టు వారి ఆదేశాల మేరకు జారీ చేయబడినది)

వాయిదా ది 31-07-2025

కావూరి జాలారావు,
వాది తరఫు న్యాయవాది,
పిడుగురాళ్ల టౌన్. పల్నాడు జిల్లా.
సెల్ నెం.9989006559.

ప్రకటన

నా క్లయింటు గుంటూరు జిల్లా , చేబ్రోలు మండలం, పాత రెడ్డిపాలెం శివారు కొత్త రెడ్డిపాలెం గ్రామ కాపురస్తుడు ముసలా శివకుమార్ గారి కుమారుడు ముసలా నాగేశ్వరరావు గారి ద్వారా సంజాయిషి పొంది యావన్మందికి తెలియజేయునది ఏమనగా, ది.02-07-2014 వ తేదీన పిట్టలవాని పాలెం గ్రామ కాపురస్తులు రావూరి సీతారామయ్య వగైరాల తావున పాత రెడ్డిపాలెం డి. నెం. 427/1 , 427/2 ర్లు రెండు నంబర్లు బాపతు య. 4-06 సెంట్లు మింజుమలె లో చ.గ. 230 లు ఖాళీ నివేశ స్థలం క్రయం పొంది చేబ్రోలు స.రి. వారి ఆఫీసులో 1 వ పుస్తకం ద.నెం. 2437/2014 రు గా రిజిస్టర్ చేయించుకుని ఉన్నాడు. సదరు దస్తావేజును ది. 12-06-2025 వ తేదీన జిరాక్స్ నిమిత్తం ఒరిజినల్ దస్తావేజును తీసుకొని కొత్త రెడ్డిపాలెం నుండి చేబ్రోలు సెంటర్ కు వచ్చుచుండగా మార్గమధ్యంలో జారిపోయినది. అప్పటి నుండి దారిన పోయే వారిని చుట్టు ప్రక్కల వారిని అడిగినప్పటికీ దొరకలేదని చెప్పినారు. ఆ మార్గం మధ్యలో వెతికినప్పటికీ ఇప్పటివరకు దొరకలేదు. సదరు ఒరిజినల్ దస్తావేజు ఎవరికైనా దొరికిన యెడల ఈ ఫోన్ నంబర్లకు తెలియపరచగలరు. అట్లు కాక సదరు దస్తావేజు ఏ విధముగానైనను అన్యాక్రాంతము చేసిన యెడల అవి చెల్లనేరవు. మా క్లైంట్ తీసుకొను సివిల్, క్రిమినల్ చర్యలకు మీరు బాధ్యులగుదురు.

తాడిబోయిన శ్రీనివాసరావు
అడ్వకేట్ మరియు నోటరీ, చేబ్రోలు
సెల్ నెం.9985037928, 8790 118502.

ప్రభుత్వ రాయితీలను రైతులు వినియోగించుకోవాలి

వ్యవసాయ శాఖ రాష్ట్ర కమిషనర్ ఢిల్లీరావు - పెదవడ్లపూడిలో రైతులతో ముఖాముఖి

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

రైతులతో ముఖాముఖీలో పాల్గొన్న ఢిల్లీరావు, ఇతరులు

మంగళగిరి మండలం పెదవడ్లపూడి గ్రామంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో గురువారం పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు. పొలం పిలుస్తుంది కార్యక్రమానికి వ్యవసాయశాఖ స్పెషల్ సిఎస్ బి రాజశేఖర్, వ్యవసాయ కమిషనర్ ఢిల్లీరావు హాజరై రైతులతో ముఖాముఖి నిర్వహించారు. గ్రామంలోని వివిధ సాగు పద్ధతులు నిర్వహణ గురించి చర్చించారు. రైతులకు ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలతో పాటు వ్యవసాయానికి అవసరమయ్యే పరికరాలను అందజేస్తుందని వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గ్రామాలలో రైతులకు తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం ఎలా పొందాలి, వ్యవసాయం లాభసాటిగా చేసుకునేందుకు తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. కౌలు రైతులు తప్పని సరిగా సిసి ఆర్సి కార్డులు తీసుకోవాలని దీని ద్వారా ఈ పంట నమోదు పంట నష్టం జరిగినప్పుడు రైతు పేరు నమోదు చేయుటకు అవకాశం ఉంటుందన్నారు. భూసారా పరీక్షలను అనుసరించి రైతులు రసాయనక ఎరువులు వినియోగించాలని సూచించారు. మంగళగిరి వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ జవ్వాది కిరణ్ చందు మాట్లాడుతూ రైతులకు పెట్టుబడి సాయం కోసమే కూటమి ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకాన్ని తీసుకు వచ్చిందని ఆయన తెలియజేశారు. వర్షాలు పడినప్పుడు రైతులు ధాన్యాన్ని టార్పాలిన్ పట్టాలతో భద్రపరచుకునే విధంగా రైతులు తగు చర్యలు తీసుకోవాలని ఆయన వారికి సూచించారు. ఈపంట నమోదు చేసుకుంటే విపత్తుల వల్ల పంట నష్టం జరిగినప్పుడు పెట్టుబడి సాయం త్వరగా అందుతుందని జవ్వాది తెలియ జేశారు. కార్యక్రమంలో ఉద్యాన వన అడిషనల్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు, గుంటూరు జిల్లా వ్యవసాయాధికారి నాగేశ్వరరావు, మంగళగిరి ఏడిఏ తోటకూర శ్రీనివాసరావు, మండల వ్యవసాయ అధికారి శైలజా రాణి, మండల ఉద్యానవన అధికారి దీపిక, ఏపీ సీఎం అఫ్ డిపిఎం రాజకుమారి, ఏఈఓలు, వీ ఎలు, వీహెచ్‌ఎలు సిబ్బంది, పాల్గొన్నారు.

రైల్వే స్టేషన్లో హాస్టల్ విద్యార్థులు - వార్డెన్‌కు అప్పగించిన పోలీసులు

ప్రజాశక్తి - తెనాలి

వారు ముగ్గురు స్నేహితులు. ఒకే హాస్టల్లో ఉంటున్నారు. ఒకే స్కూల్లో చదువుతున్నారు. హాస్టల్లో ఉదయం టిఫిన్ చేసి స్కూలుకని బయలుదేరారు. కానీ వారు స్కూలుకు హాజరు కాలేదు. ఆ విషయం వార్డెన్‌కు కూడా తెలియదు. వారు అనుమానాస్పదంగా రైల్వేస్టేషన్లో ఉండగా జిఆర్‌పి ఎస్సై జి.వెంకటాద్రి గమనించి ప్రశ్నించి అదుపులోకి తీసుకున్నారు. వెంటనే హాస్టల్ వార్డెన్‌కు సమాచారం ఇచ్చి క్షేమంగా విద్యార్థులను అప్పగించారు. ఎస్సై మాట్లాడుతూ కొల్లిపర మండలం దావులూరిపాలెంకు చెందిన ఎల్ కిషోర్ బాబు, వేమూరు మండలం వరహాపురం గ్రామానికి చెందిన నాయుడు అభిరామ్, రేపల్లె ఓల్డ్ టౌన్‌కు చెందిన ఎ జితేంద్ర దర్శన్ స్థానిక సాంఘిక సంక్షేమ శాఖ బాలుర వసతి గృహంలో ఉంటున్నారనీ, స్కూలుకు వెళ్లడం ఇష్టం లేక స్టేషన్ వైపు వచ్చినట్లు తెలిపారు. హాస్టల్ వార్డెన్ ఆదినారాయణ మాట్లాడుతూ వారిలో ఇరువురికి ఇంకా స్కూలులో అడ్మిషన్ కాలేదనీ, హాస్టల్లో మాత్రం చేర్చారనీ, చెప్పులు కొనుక్కునేందుకు ముగ్గురు స్టేషన్ సమీపంలోని షాపుకు వెళ్లి అక్కడి నుంచి మంచినీళ్ల తాగేందుకు స్టేషన్ లోకి వెళ్లగా పోలీసులు గమనించి తమకు సమాచారం ఇచ్చినట్లు చెప్పారు. రైల్వే పోలీసులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

దుగ్గిరాలకు చేరిన నీరు

చెరువులకు నీరు విడుదల

ప్రజాశక్తి - దుగ్గిరాల

డెల్టా ప్రధాన కాలువ బకింగ్ హామ్ కెనాల్ నుండి తుంగభద్ర (మద్రాస్) కాలువకు బుధవారం సాయంత్రం చెరువులకు మంచినీటిని విడుదల చేశారు. అవి గురువారం ఉదయం దుగ్గిరాలకు చేరాయి. ప్రస్తుతం 300 క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్టు సెంట్రల్ సబ్ డివిజన్ డిఈ ఆర్.శ్రీనివాసరావు తెలిపారు. రైతుల డిమాండ్‌ను బట్టి అవసరమైతే ఖరీఫ్ సీజన్‌కు నీటి పరిమాణం పెంచుతామన్నారు.

ఉమామహేశ్వరరెడ్డికి నాట్స్ ఆహ్వానం

ప్రజాశక్తి - చేబ్రోలు

ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం ఉపాధ్యక్షులు బొమ్ము ఉమామహేశ్వర రెడ్డికి ఉత్తర అమెరికా తెలుగు సంఘం (నాట్స్) ఆధ్వర్యంలో నిర్వహించుచున్న అమెరికా తెలుగు సంబరాలకు ఆహ్వానం. అమెరికాలో 4, 5,6 తేదీలలో జరిగే నార్త్ అమెరికా తెలుగు సొసైటీ (ఎన్‌ఎటిఎస్) ఎనిమిదవ వేడుకలలో పాల్గొనాలంటూ తనకు ఆహ్వానం అందిందని తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఇది తెలుగు సంబరం. అన్నారు. అమెరికాలో తెలుగువారి గొప్పతనాన్ని చాటి చెప్పేందుకు తనకు అవకాశం ఇచ్చిన నార్త్ అమెరికా తెలుగు సొసైటీ ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

గౌరవ 2వ అడిషనల్ సివిల్‌జడ్జి (జూనియర్ డివిజన్) తెనాలి వారి కోర్టులో
ఇ.పి. నెం. 206/2024 ఇన్
ఓ.యస్. నెం. 646/2023

బిట్వీన్
దేశబోయిన పోతురాజు ... డిక్రీ హోల్డర్
మరియు
తుల్లిమిల్లి గోపి .... జడ్జిమెంట్ డెటార్
టు
తుల్లిమిల్లి గోపి, తండ్రి : లేటు చింతయ్య, వయస్సు 35 సం॥లు, హిందువు, వ్యవసాయం, డోర్ నెం. 62, యాదవపాలెం, అత్తోట, కొల్లిపర మండలం, గుంటూరుజిల్లా.

పైన పేర్కొన్న అమలు దావా పిటీషన్‌లో మీకు ఎన్నిసార్లు నోటీసులు పంపిననూ మీరు కావాలనే తీసుకొనక కాలయాపన చేయుచున్నారు. గౌ॥ కోర్టు వారు దినపత్రిక ద్వారా మీకు నోటీసులు పంపవలసినదిగా ఆదేశించియున్నారు. కావున మీరు ది. 24-7-2025 తేదీన పైన పేర్కొన్న గౌ॥ న్యాయస్థానంలో హాజరై మీ యొక్క ఆక్షేపణలు తెలియజేసుకొనవలసినది. లేనిచో మీ పరోక్షములో తీర్మానం చేయబడునని ఇందుమూలంగా తెలియజేయటమైనది.

గౌ॥ కోర్టువారి ఆదేశములతో
వాయిదాతేది : 24-7-2025

నన్నపనేని మాధవరావు,
డిహెచ్‌ఆర్ తరఫు న్యాయవాది.

Notice
IN THE COURT OF THE II ADDL.DIST.JUDGE:: GUNTUR
M.V.O.P.No.118/2023

Between:
Adusumalli Pushpalatha .... Petitioner
And
Prudhvi Constructions Pvt Ltd Rep.by its Vaddineni Siva Rama Prasad & Others ..... Respondents

To,
R-1: Prudhvi Constructions Pvt Ltd Rep.by its Vaddineni Siva Rama Prasad,R/o.Door No.8-1-2,Sai Nagar,2nd line, Stambalagaruvu ,Guntur , Guntur Dist.

పై నెంబరు యం.వి.ఓ.పి.లోని పిటీషనరు యాక్సిడెంటులోతనకు తగిలిన దెబ్బలుకు నష్టపరిహారం కొరుచూ దాఖలు చేసిన పిటీషనులో 1 వ రెస్పాండెంటు అయిన మీకు పైకోర్టువారి నుండి నోటీసులు పంపించినను మీరు తీసుకొనక కాలయాపన చేయుచున్నందున శ్రీ కోర్టువారు మీకు నోటీసును ఈ పేపరు ప్రకటన ద్వారా తెలియజేయమని ది:26-08-2025కి వాయిదా వేసినారు. కావున వాయిదా రోజున ఉ. గం. 10-30ని.లకు పై కోర్టు వారి ఎదుట మీరు స్వయంగా గాని లేక మీ వకీలు గారి ద్వారా గాని హాజరై మీకు గల ఆక్షేపణలను తెలుపుకొనగలరు. లేనిచో శ్రీ కోర్టు వారిచే చట్ట ప్రకారం మీ పరోక్షంగా విచారించి తీర్మానించబడును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

వాయిదా తేది:26-08-2025

తోట శ్రీనివాస రావు,
పిటీషనరు తరపు అడ్వకేట్,
గుంటూరు.

Suit Summons
IN THE COURT OF THE PRL.CIVIL JUDGE(JUNIOR DIVISION):: GUNTUR
O.S.No.1406/2019

Between:
M/s.Sri Karthikeya Agencies Rep.by its Prop.Nerella Suneetha, Rep.by her GPA Holder Nerella Kishore .. Plaintiff
And
Palakaluri Nancharamma@Siva Nagalakshmi & Others .. Defendants

To,
D-3: Palakaluri Suresh,S/o.Late Srinivasa Rao,R/o.2-91,Visadala Village, Medikonduru Mandal, Guntur Dist..

పై నెంబరు దావాలో 3వ ప్రతివాది అయిన మీకు పై కోర్టు వారి నుండి ఎన్ని సార్లు సమన్లు పంపిన కూడా తీసుకోనకుండా కాలయాపన చేస్తున్నందున శ్రీ కోర్టు వారు మీకు సమన్లు ఈ పేపరు ప్రకటన ద్వారా తెలియజేయమని ది.07-07-2025కి వాయిదా వేసినారు. కావున వాయిదా రోజు ఉ.గం. 10-30 ని.లకు పై కోర్టు వారి యెదుట మీరు స్వయంగా కాని లేదా మీ తరపు అడ్వకేట్ ద్వారా గాని హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకొనగలరు.లేనిచో సదరు దావా మీ పరోక్షంగా విచారించి తీర్మానించబడును.

వాయిదా తేది:07-07-2025

ఆర్.కె.శ్రీనివాస మూర్తి,
వాది తరపు అడ్వకేట్,
2/11బ్రాడీపేట, గుంటూరు.

రైళ్లలో లీగల్ టీం విస్తృత తనిఖీలు

గంజాయి ఆకుతో తయారు చేసిన చాక్లెట్లు స్వాధీనం

ప్రజాశక్తి - తెనాలి

రాష్ట్ర డిజిపి, జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు విజయవాడ తెనాలి మార్గంలో ఎక్స్ప్రెస్ రైళ్లలో తనిఖీలు నిర్వహించినట్లు గుంటూరు మహిళా పోలీస్ స్టేషన్ డిఎస్పి శ్రీనివాస్ వెల్లడించారు. విజయవాడ నుంచి తెనాలి వరకు రైలులో ప్రయాణించి తనిఖీలు నిర్వహించిన అనంతరం డిఎస్పి శ్రీనివాస్ మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జి ఆర్‌పి, ఆర్‌పిఎఫ్, లోకల్ పోలీస్ సమిష్టిగా లీగల్ టీంగా ఏర్పడి రైళ్లలో గురువారం తనిఖీలు నిర్వహించగా తనిఖీలలో గంజాయి ఆకుతో తయారుచేసిన చాక్లెట్లు ఉన్న బ్యాగ్ లభించిందనీ, అయితే సంబంధిత వ్యక్తులు ఎవరూ దొరకలేదని చెప్పారు. బ్యాగును జిఆర్పి పోలీసులకు అప్పగించి దర్యాప్తు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో తెనాలి డిఎస్పి బి జనార్ధనరావు, 3 టౌన్ సిఐ ఎస్ రమేష్ బాబు, ఆర్పిఎఫ్ జిఆర్పి సిబ్బంది ఉన్నారు.

అసైన్డ్ భూముల వివరాల కోసం వినతి

ప్రజాశక్తి - అచ్చంపేట

అచ్చంపేట మండలంలో ఉన్న అసలు భూములు, అటవీ శాఖల భూముల వివరాలు జనసేన పార్టీ అచ్చం పేట మండల అధ్యక్షుడు మట్టం వీరభద్రరావు ఎం.సరోజను కోరారు. విలేకరులతో మాట్లాడుతూ జన సేన పార్టీ ఉమ్మడి గుంటూరు జిల్లా అధ్యక్షులు.గాదె వెంకటేశ్వరరావు నియోజకవర్గ సమన్వయకర్త ఎర్రంశెట్టి రామకృష్ణ సూచనల మేరకు అచ్చంపేట మండల పరిధి లోని అటవీ భూములు, అసైన్డ్ భూముల వివరాలను పూర్తి సమాచారాన్ని అందించాలని తహశీల్దార్ కోరా మన్నారు మండలంలోని ఉన్న అసైన్డ్ భూము ల రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు ప్రజా సమస్యలపై నిత్యం జన సేన పార్టీ సమస్యలు పరిష్కారం అయ్యే దిశగా పని చేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. అచ్చం పేట జనసేన పార్టీ మండల ప్రధాన కార్యదర్శి. కునిశెట్టి సత్యనారాయణ, పగడాలశివ, మండలనాయకులుప్రసాద్,హనుమంతు,గోపి,అనీ పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లకు ఆర్పీఎఫ్ పోలీసుల కౌన్సిలింగ్

ప్రజాశక్తి - తెనాలి

ప్రయాణికులతో జాగ్రత్తగా మెలగాలని, ఆథరైజ్డ్ ప్రజా రవాణా వాహనాలను అడ్డుకో రాదని ఆర్పిఎఫ్ ఇన్‌స్పెక్టర్ హీరా సింగ్ చెప్పారు. తెనాలి రైల్వే స్టేషన్ ప్రాంగణంలోని ఆటో డ్రైవర్లకు గురువారం ఏఎస్ఐ శివరామకష్ణయ్య ఆధ్వ ర్యంలో నిర్వహించిన కౌన్సిలింగ్‌లో ఆయన పాల్గొన్నారు. ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ ప్రయాణికులకు ఇబ్బంది కలిగించకూడదని చెప్పారు. ప్రతి డ్రైవర్ లైసెన్సు, ఆటోకు సంబంధించిన పత్రాలు ఎప్పుడు దగ్గర ఉంచుకోవాలన్నారు. ప్రయాణికులపై ఎలాంటి అనుమానం వచ్చినా, వారు తీసుకు వెళ్లే లగేజీపై సందేహం ఉన్నా వెంటనే ఆర్పిఎఫ్ సిబ్బందికి ఫిర్యాదు చేయాలన్నారు.

IN THE COURT OF THE PRL. SR. CIVIL JUDGE AT SRIKAKULAM
O.S. No. 53/2024

Between :
Jaye Mahesh .... Plaintiff / Petitioner
And
1. Madduru Sandhya Rani
2. Madduru Rajasekhara Reddy
3. Madduru sailaja @ Saidamma
.... Defendants / Respondents

To,
Respondent / Defendant No.1
మద్దూరు సంధ్యారాణి, భర్త: శ్రీధర్‌రెడ్డి (లేట్), డోర్ నెం. 11-12-10/2, రామిరెడ్డిపేట, పాత పోస్టాఫీస్ దగ్గర, నరసరావుపేట, పిన్ : 522601, పాత గుంటూరుజిల్లా. ప్రస్తుత పల్నాడు జిల్లా, ఆంధ్రప్రదేశ్.

పై నెంబరు దావా నందు మీరు డిఫెండెంట్/ రెస్పాండెంట్ నెం.1గా వుండి ఎన్నిసార్లు సమన్లు పంపిన తీసుకోని కారణంగా శ్రీకాకుళం ప్రిన్సిపల్ సీనియర్ సివిల్‌జడ్జి వారు ఈ పేపరు పబ్లికేషన్‌కు ఆర్డరు ఇచ్చియున్నారు. ది 9-7-2025వ తేదీన ఉదయం 10-30 గం.లకు మీరు స్వయంగా గానీ, అడ్వకేటుగారి ద్వారా గానీ హాజరై ఆక్షేపణలు వున్న యెడల తెలుపుకొనవలెను. లేనియెడల మీ పరోక్షమున తీర్మానించబడునని ఇందుమూలంగా తెలియజేయడమైనది.

Address for Services :
Shaik Rafi, Gandeti Kiran Kumar, P. Lalitha, Advocate, Plot No.393, YSR Jagananna Colony (Urban), Vakalavasa Village, SriKakulam Mandal, Srikakulam District - 532484.
Cell : 90149 30999, 83090 33823, 8309098113.

అసైన్డ్ రైతులపై అటవీ శాఖాధికార్ల కేసులు

- సమస్యను పరిష్కరించకుంటే మేమే భూముల్లోకి వెళ్తాం
- తహశీల్దార్ కార్యాలయం ఎదుట బాధితుల ధర్నా - తహశీల్దార్ హామీ

ప్రజాశక్తి - అచ్చంపేట

రెవెన్యూ సదస్సులో అర్జీలు ఇచ్చినా సమస్యల పరిష్కారం కాలేదని అసైన్డ్ రైతులు వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద గురువారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా సంఘం పల్నాడు జిల్లా కార్యదర్శి జి.రవిబాబు మాట్లాడుతూ చెరుకుంపాలెం గ్రామంలో తాళ్లచెరువు రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 318 ,319, 320, 321లలోని భూమిని 1993లో నిరుపేదల కేటాయించారని, అయితే అవి అటవీ భూములంటూ రైతులపై అటవీ శాఖ అధికారులు కేసులు నమోదు చేస్తున్నారని చెప్పారు. దీనిపై గతేడాది అచ్చంపేట తహశీల్దార్, సత్తనపల్లి ఆర్డీవో, పల్నాడు జిల్లా కలెక్టర్‌కు విన్నవించగా ంవెన్యూ అటవీ శాఖ అధికారులతో జాయింట్ యాక్షన్ కమిటీగా సర్వే చేసి హద్దులు నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారని తెలిపారు. ఆ తర్వాత కూడా రైతులను అధికారులు ఇబ్బందులు గురి చేస్తున్నారని, నగదు డిమాండ్ చేస్తున్నారని విమర్శించారు. అటవీ శాఖ అధికారుల అభ్యంతరాలు లేకుండా చూడాలని, ఆ భూముల్లో రైతులు సాగు చేసుకోవడానికి వీలు కల్పించాలని డిమాండ్ చేశారు. అసైన్డ్ భూములను పరిరక్షించాల్సిన బాధ్యత రెవెన్యూ అధికారులపై ఉందన్నారు. అనంతరం తహశీల్దార్ ఎన్.సరోజకు వినతిపత్రం ఇవ్వగా ఆమె స్పందిస్తూ.. రికార్డులను పరిశీలించి వీలైనంత త్వరగా సమస్యలు పరిష్కరిస్తామని, తానే స్వయంగా పరిశీలిస్తానని చెప్పారు. త్వరగా పరిష్కరించకుంటే తామే భూముల్లోకి వెళ్లి సాగు చేసుకుంటామని రైతులు, నాయకులు స్పష్టం చేశారు. ధర్నాలో కౌలు రైతు సంఘం నాయకులు టి.హనుమంతరావు, టి.వెంకటేశ్వర్లు షేక్ హసన్, కెకె రెడ్డి, రైతులు ఎస్.వెంకటేశ్వర్లు, ఎస్.భానురావు, సిహెచ్.జార్జి, డి.మరియమ్మ, కె.సంధ్య పాల్గొన్నారు.

తహశీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న రైతులు, నాయకులు

మున్సిపల్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న కార్మికులు

నేడు మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల చలో విజయవాడ

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

పారిశుధ్య కార్మికుల సమస్యల పరిష్కారం కోసం శుక్రవారం జరిగే చలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని యూనియన్ పల్నాడు జిల్లా అధ్యక్షులు వి.చంద్రకళ పిలుపునిచ్చారు. ఈ మేరకు సత్తెనపల్లి మున్సిపల్ కార్యాలయం ఎదుట పారిశుధ్య కార్మికులు గురువారం ఆందోళన చేపట్టగా చంద్రకళ మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులు చేసిన సమ్మె కాలపు ఒప్పందాలను ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఇంజినీరింగ్ కాంట్రాక్ట్ కార్మికుల వేతనాలు పెంచాలని, సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని కోరారు. కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలన్నారు. కార్యక్రమంలో జె.రాజ్‌కుమార్, జాని, థామస్, కుమారస్వామి పాల్గొన్నారు.

స్తూపం కూల్చివేత.. సిపిఎం నిరసన

ప్రజాశక్తి-చిలకలూరిపేట

ఇళ్లను పడేస్తున్నామనే వంకతో పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి స్తూపాన్ని కూల్చారని సిపిఎం పట్టణ కార్యదర్శి పి.వెంకటేశ్వర్లు, నాయకులు ఎస్.లూథర్ అన్నారు. స్థానిక 12వ వార్డు పిల్లి అంకమ్మ చౌక్ పేరుతో 1950 నుండి వర్ధంతి సభలు, క్రీడలు, ఇతర సభలు నిర్వహిస్తున్నామని, ఈ విషయం స్థానికులకూ తెలుసని చెప్పారు. అయితే స్తూపం వెనక ఉన్న ఇంటిని పట్టణానికి చెందిన పఠాన్ నబీ అనే వ్యక్తి తాను కొన్నానంటూ గురువారం ఉదయం 11 గంటల ప్రాంతంలో పొక్లెయినర్‌ను తెప్పించి స్థలంలోని పాత ఇంటిని, చెట్లను కూల్చేశారని, అదే క్రమంలో స్తూపాన్ని కూడా కూల్చేయించారని విమర్శించారు. స్తూపం విషయాన్ని సిపిఎం నాయకులు ఎస్.లూథర్ ముందుగానే చెప్పారని, అయినా అతను పట్టించుకోలేదని అన్నారు. ఈ మేరకు స్తూపం ప్రదేశంలో ఎస్.బాబు, ఎస్.జేమ్స్, ఎస్.కృపారావు, విజయలక్ష్మీ, వీరబాబు, బి.ఏసుదయమ్మ, సిపిఎం అభిమానులు నిరసన తెలిపారు. పోలీసులకూ సమాచారం ఇవ్వడంతో వారు అక్కడికి రాగా సిపిఎం నాయకులు వినతిపత్రం ఇచ్చారు. స్తూపాన్ని పడేసిన వారిపై కేసు నమోదుతోపాటు అరెస్టు చేయాలని నాయకులు డిమాండ్ చేశారు.

ప్రభుత్వ పథకాలతో రైతుల ఆదాయం రెట్టింపు : కలెక్టర్

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ప్రభుత్వ పథకాలను వినియోగించుకుని రైతులు రెట్టింపు ఆదాయం పొందవచ్చని, తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం అందించే పంటలను సాగు చేయాలని పల్నాడు జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు అన్నారు. నరసరావుపేట, రొంపిచర్ల మండలాలలో ఉద్యాన పొలాలను కలెక్టర్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సబ్సిడీలో అందించే సూక్ష్మ సేద్యం పరికరాల ద్వారా ఎరువుల వినియోగం, నీటి వినియోగం పొలంలో ప్రతి అంగుళమూ చక్కగా సాగవుతుందన్నారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి జిల్లాలో 10 వేల ఎకరాల సూక్ష్మ సేద్య పరికరాల పంపిణీ లక్ష్యాన్ని పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. రొంపిచర్ల మండలం అన్నవరంలో లింగయ్య చౌదరి పొలంలో జామ తోటలో బిందు సేద్యం పరికరాల పని తీరును పరిశీలించారు. భూగర్భ జల వనరుల శాఖ అమర్చే ఫ్లో మీటర్లను ఏర్పాటు ద్వారా పొలంలో ఎన్ని లీటర్ల నీటి వినియోగమవుతుందో తెలుస్తోందని రైతు లింగయ్య తెలిపారు. నరసరావుపేట మండలంలో ఇక్కుర్తిలో పోతురాజు శివయ్య చేపట్టిన వంగ, గులాబీ సాగును పరిశీలించారు. రెండు, మూడు రకాల పంటలు సాగు చేయడం ఆర్థికంగా భరోసా ఉంటుందని రైతులకు జిల్లా కలెక్టర్ చెప్పారు. సూర్య ఘర్ పథకం కింద తన ఇంటిపై సోలార్ ప్యానెల్ ఏర్పాటు చేసుకున్న శివయ్యను అభినందించారు. అనంతరం ఇక్కుర్తి గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. గుడ్లు, పాల నాణ్యతను పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా మైక్రో ఇరిగేషన్ అధికారి సిహెచ్ ఆంజనేయులు, జిల్లా ఉద్యాన శాఖ అధికారి వెంకట్రావు పాల్గొన్నారు.

రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు

ప్రాజెక్టు అధికారులకు అంగన్వాడీల సమ్మె నోటీసు

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

అంగన్వాడీల 42 రోజులు సమ్మె కాలపు ఒప్పందాలను కూటమి ప్రభుత్వం అమలు చేయాలని సిఐటియు మండల కార్యదర్శి పెండ్యాల మహేష్ డిమాండ్ చేశారు. 9న దేశ వ్యాప్తంగా జరిగే సార్వత్రిక సమ్మె నేపథ్యంలో అంగన్వాడీ కార్యకర్తలు సిఐటియు ఆధ్వర్యంలో ఐసిడిఎస్ సత్తెనపల్లి ప్రాజెక్టు అధికారులకు గురువారం సమ్మె నోటీసు అందచేశారు. ఈ సందర్భంగా మహేష్ మాట్లాడుతూ కార్మికులు పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రద్దుచేసి కార్మిక వ్యతిరేక 4 రకాల లేబర్ కోడ్ లను తెచ్చిందని, వీటిని రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు జె.రాజ్‌కుమార్ అంగన్వాడి ప్రాజెక్టు అధ్యక్షులు కె.సుజాత, నాయకులు అంజనీ, ప్రభావతి, కళ్యాణి పాల్గొన్నారు.

ప్రజాశక్తి -రెంటచింతల

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక, కర్షక, ప్రైవేటీకరణ ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా ఈనెల 9న దేశవ్యాప్తంగా జరిగే సమ్మెలో కార్మికులంతా పాల్గొనాలని సిఐటియు పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.ఆంజనేయులు నాయక్ కోరారు. ఈ మేరకు స్థానిక ఎంపిడిఒ కార్యాలయం సమీపంలో కరపత్రాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. కేంద్రంలో అధికారంలో ఉన్న ఎన్డీఏ ప్రభుత్వం లేబర్ కోడ్ తీసుకురావడం వల్ల కోట్లాది మంది కార్మికులు తమ హక్కులను కోల్పోయే పరిస్థితి రాబోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. వీటి రద్దు కోసం సాగే సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు టి.నాగేశ్వరరావు, వివిధ రంగాల కార్మికులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని భవన నిర్మాణ కార్మిక సంఘం పల్నాడు జిల్లా అధ్యక్షులు అవ్వారు ప్రసాదరావు, కార్యదర్శి షేక్ సిలార్ మసూద్ డిమాండ్ చేశారు. 9న జరిగే సార్వత్రిక సమ్మెను చేయాలని కోరుతూ భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో సత్తెనపల్లి పట్టణంలో కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికులు పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. 1214 జీవోను రద్దుచేసి సంక్షేమ పథకాలను పునరుద్ధరించాలన్నారు. కార్యక్రమంలో సిఐటియు పట్టణ కన్వీనర్ జె.రాజ్‌కుమార్, కార్మికులు సాల్మన్‌రాజు పాల్గొన్నారు.

కౌల్దార్లకు ఉచిత పంటల బీమా అమలు చేయాలి : కౌలురైతు సంఘం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా : రాష్ట్ర వ్యవసాయంలో 70 శాతాన్ని కౌల్దార్లే సాగు చేస్తున్నారని, వారికి ఉచిత పంటల బీమా పథకాన్ని అమలు చేయాలని కౌలురైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వై.రాధాకృష్ణ కోరారు. ఈ మేరకు గురువారం ఆయన నరసరావుపేటలో విలేకర్లతో మాట్లాడారు. ప్రదాన మంత్రి ఫసల్ బీమా యోజనలో ఆహార పంటలకు 2 శాతం ప్రీమియం, వాణిజ్య పంటలకు 5 శాతం ప్రీమియం రైతులు చెల్లించాల్సి ఉందని, బీమా కంపెనీకి చెల్లించాల్సిన మొత్తం ప్రీమియంలో 3 శాతం ప్రీమియం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెరిసగం చెల్లిస్తున్నాయని చెప్పారు. పంటలు సాగు చేయని భూయజమానులు పంట రుణాలను పొందుతున్నా పంట నష్టాలతో వారికి ప్రమేయం లేదు కనుక పంటల బీమా ప్రీమియం చెల్లించడానికి ఇష్టపడటం లేదని అన్నారు. కొద్ది మంది చెల్లించినా బీమా పరిహారం వాస్తవ సాగు దారులకు కాకుండా సాగు చేయని భూ యజమానులకే బీమా పరిహారం అందుతుందన్నారు. ఈ నేపథ్యంలో నష్టాలంతా కౌల్దార్లే భరిస్తున్నారని ఆవేదన వెలిబుచ్చారు. ఫసల్ బీమా యోజనలో వాతావరణ ఆధారిత బీమా ప్రీమియాన్ని జులై 15 , దిగుబడి ఆధారిత పంటలకు జులై 31 లోపు రిజిస్ట్రేషన్ చేయించాలని విధించిన గడువును పెంచాలని డిమాండ్ చేశారు. పల్నాడు జిల్లాలో ఆగస్టు, సెప్టెంబర్ నెలలో సాగుకు రైతులు సిద్ధం అవుతారని, ఈ నేపథ్యంలో సెప్టెంబర్ 15 వరకు బీమా నమోదు గడువు పెంచాలని, రబీ పంటలకు నవంబర్ నుండి ఫిబ్రవరి లోగా పంటల బీమా చేయించాలని కోరారు. కౌలురైతులను ఈ-క్రాప్ లో నమోదు చేయాలని, వారికే అన్నదాత సుఖీభవ పథకం కింద రూ.20 వేల పెట్టుబడి సాయం ఇవ్వాలని డిమాండ్ చేశారు. పంట సాగు హక్కు పత్రాలు పొందిన కౌలు రైతులకు హామీ లేకుండా స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం రూ.2 లక్షల వరకు బ్యాంకులు రుణాలిచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. గతంలో మాదిరి రూ.లక్షకు సున్నా వడ్డీ మరో రూ.లక్షకు పావలా వడ్డీ రుణాలు మంజూరు చేయాలన్నారు.

పవర్ లిఫ్టర్లకు ఎమ్మెల్యే అభినందన

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్ : జాతీయ స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో పతకాలు సాధించిన పవర్ లిఫ్లర్లను ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అభినందించారు. ఇటీవల కర్ణాటకలో జరిగిన జాతీయ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో సత్తెనపల్లికి చెందిన పసుపులేటి వంశీకృష్ణ రెండు స్వర్ణ పతకాలు, మండలంలోని కంకణాలపల్లికి చెందిన ఎన్.శరత్ కాంస్యం పతకాలు, గుడిపూడి చెందిన లింగిశెట్టి శివనాగేశ్వరరావు సౌత్ ఇండియా కాంపిటీషన్లో బంగారు పతకం సాధించడంపై ఎమ్మెల్యే సత్తెనపల్లి పట్టణంలోని రఘురాం నగర్‌లోని తన కార్యాలయంలో గురువారం అభినందించారు. ఇలాంటి వారిని అందరూ ప్రోత్సహిస్తే మరింతగా రాణిస్తారని చెప్పారు. కార్యక్రమంలో కోచ్, పల్నాడు జిల్లా సెక్రెటరీ పసుపులేటి సురేష్, రాజు పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ పెదకాకాని, కొల్లిపర, ఫిరంగిపురంలలో మాట్లాడుతున్న నాయకులు

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి

ప్రజాశక్తి -పెదకాకాని

ఈనెల 9వ తేదీన జరిగే సమ్మెను జయప్రదం చేయాలని స్థానిక సిఐటియు కార్యాలయంలో గురువారం ఏపీ గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ మండల జనరల్ బాడీ సమావేశం జరిగింది. సమావేశానికి నాయకులు ఎస్.కె.బోస్ అధ్యక్షతన వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి నన్నపనేని శివాజీ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన కార్మిక వర్గాన్ని కట్టు బానిసలుగా మార్చే లేబర్ కోడ్స్ రద్దు చేయాలని కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని పంచాయతీ కార్మికులకు కనీస వేతనం 21000 ఇవ్వాలని కోరారు. పిఎఫ్ ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని కార్మికుల తొలగింపును ఆపాలని సూచించారు. వెనిగండ్ల ఉప్పలపాడు గ్రామపంచాయతీలలో గత 10 నెలలుగా సబ్బులు నూనె గుర్తింపు కార్డులు ఇవ్వలేదని వెంటనే సబ్బులు నూనె గుర్తింపు కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలోఏపీ గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ నాయకులు షేక్ సుభాష్ చంద్రబోస్, కుక్కమళ్ళ శేషగిరి, దానియేలు బాబు, రాహులమ్మ, రాణి పాల్గొన్నారు.

ప్రజాశక్తి - కొల్లిపర

పెట్టుబడిదారులు ప్రయోజనాల కోసం కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తీసుకువచ్చిన కార్మిక వ్యతిరేక చట్టాలకు నిరసనగా జులై 9న జరిగే దేశవ్యాపిత సమ్మెలో కార్మిక వర్గం రైతులు వ్యవసాయ కార్మికులు కౌలు రైతులు పాల్గొనాలని ములకాశివ సాంబిరెడ్డి తెలిపారు. గురువారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ 100 సంవత్సరాలు క్రితం బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను ఈరోజు బిజెపి ప్రభుత్వం పెట్టుబడిదారుల ప్రయోజనాల కోసం కార్మిక హక్కులను కాలరాస్తుందని విమర్శించారు. సిపిఐ నాయకులు తుంగ బాలస్వామి మాట్లాడుతూ మండలంలో గల అంగన్వాడి ఆశ పంచాయతీ కార్మికులు మధ్యాహ్న భోజన కార్మికులను స్కీం వర్కర్లుగా గుర్తించాలని కోరారు. సిఐటియు మండల కార్యదర్శి కోట చంద్రశేఖరరావు మాట్లాడుతూ స్కీం వర్కర్లుగా గుర్తించి కనీస వేతనం 26000 ఇవ్వాలని ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ ఈనెల తొమ్మిదో తేదీన కొల్లిపర అంబేద్కర్ విగ్రహం వద్ద నుండి తహాశీల్దార్ కార్యాలయం వరకు కార్మిక ప్రదర్శనలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

ప్రజాశక్తి - ఫిరంగిపురం

మండల కేంద్రంలో గ్రామ పంచాయతీ కార్మికుల జనరల్ బాడీ సమావేశం జరిగింది. సమావేశంలో సిఐటియు మండల కార్యదర్శి షేక్ మస్తాన్‌వలి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక, కర్షక ప్రైవేటీకరణ ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా ఈనెల తొమ్మిదవ తేదీన జరగబోయే సార్వత్రిక సమ్మెలో దేశవ్యాప్తంగా ఉన్న కార్మికులు ఉద్యోగులు పాల్గొని జయప్రదం చేయాలన్నారు. ఈ సందర్భంగా మస్తాన్‌వలి మాట్లాడుతూ కాంట్రాక్ట్ కార్మికులను స్కీం వర్కర్లను రెగ్యులర్ చేయాలని, ఆహార పదార్థాలు మందులు వ్యవసాయ పరికరాలు మొదలైన వాటిపై వస్తు సేవల పనులు మినహాయించాలని, వంటగ్యాస్ పెట్రోలియం ఉత్పత్తులపై కేంద్ర ఎక్సైజ్ సుంకాన్ని తగ్గించాలని ప్రభుత్వ కోరారు. సార్వత్రిక సమ్మెలో అధిక సంఖ్యలో కార్మికులు కర్షకులు అందరూ పాల్గొని సమ్మెను జయప్రదం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల నాయకులు ఇబ్రహీం, సతీష్, అనోక్, బాలయ్య, రామారావు, శామ్యూల్, తదితరులు పాల్గొన్నారు..

ప్రజాశక్తి - మంగళగిరి

క్లాప్ ఆటో డ్రైవర్లు సార్వతిక సమ్మెలో పాల్గొనాలని కోరుతూ గురువారం కాంట్రాక్టు కంపెనీ సూపర్వైజర్‌కు సమ్మె నోటీసు సిఐటియు నాయకులు అందజేశారు. సందర్భంగా సిఐటియు పట్టణ కార్యదర్శి ఎం.బాలాజీ మాట్లాడుతూ ఈనెల 9వ తేదీన దేశవ్యాప్తంగా 540 పైగా కార్మిక,రైతాంగ, ఉద్యోగ సంఘాలు కేంద్రం నూతనంగా తీసుకువచ్చిన 4లేబర్ రోడ్లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సమ్మె చేస్తున్నట్లుగా తెలిపారు. సమ్మెలో అన్ని రంగాల కార్మికులు, ఉద్యోగులు తమ తమ డిమాండ్లపై సమ్మెలో కోరారు. సమ్మె నోటీస్ అందజేసిన వారిలో క్లాప్ ఆటో డ్రైవర్స్ యూనియన్ నాయకులు డి.శివ సాంబశివ రావు, వంశి కార్మికులు ఉన్నారు.

ఆశావర్కర్లు సమ్మెలో పాల్గొనాలి..

ఆశావర్కర్లు సమ్మెలో పాల్గొనాలని సిఐటియు పట్టణ కార్యదర్శి బాలాజీ కోరారు. పట్టణంలోని మార్కండేయ కాలనీ పి.హెచ్.సి చేస్తున్న ఆశ వర్కర్లతో సమావేశం గురువారం జరిగింది. బాలాజీ మాట్లాడుతూ ఈనెల 9న జరుగుతున్న సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. ఆశ వర్కర్లకు చాలీచాలని జీతాలు ఇస్తున్నారని కనీస వేతనం 26వేలు ఆశాలకి వర్తింపచేయాలని డిమాండ్ చేశారు. జనాభా ప్రాతిపదికన ప్రతి వెయ్యి మందికి ఒక ఆశా వర్కర్ చొప్పున కొత్త నియామకాలు చేపట్టాలని కోరారు. ఆశాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం నూతన పిహెచ్‌సి కమిటీని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ నీరుకొండలోని ఎస్‌ఆర్‌ఎమ్ యూనివర్సిటీ వద్ద కరపత్రాలను సిపిఎం నాయకులు గురువారం పంపిణీ చేశారు. భాగ్యరాజు మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న ఎన్డీఏ కూటమి కార్మికుల హక్కులను కాలరాసే కార్మిక చట్టాల సవరణలు తీసుకొస్తుందని, దీని ద్వారా కార్మికులు తమ హక్కులను కోల్పోయే పరిస్థితి రాబోతున్నదని తెలిపారు ఇప్పటి వరకు బ్రిటిష్ గవర్నమెంట్ తీసుకు వచ్చిన కార్మిక చట్టాలు కార్మికులకు ఎంతో కొంత ఉపయోగపడుతుంటే వాటి స్థానంలో కార్మికులకు ఇంకా మేలు కల్పించే చట్టాలు తేవాల్సింది పోయి ఉన్న చట్టాలను మార్చి కార్మికులకు హక్కులు లేకుండా కార్పొరేట్ సంస్థలకు ఊడిగం చేసే విధంగా కార్మిక చట్టాల సవరణ చేయటం దుర్మార్గ చర్య అని అన్నారు.

మంగళగిరిలో సమ్మెనోటీసు అందజేస్తున్న సిఐటియు నాయకులు, ఆశావర్కర్లకు కరపత్రాలు అందజేస్తున్న సిఐటియు పట్టణ కార్యదర్శి బాలాజి, ఎస్‌ఆర్‌ఎం కళాశాల వద్ద కరపత్రాలు పంపిణీ చేస్తున్న సిపిఎం నాయకులు

తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న జేఏసీ నాయకులు

వక్ఫ్ సవరణ చట్టాన్ని రద్దు చేయాలి

ప్రజాశక్తి - మంగళగిరి

ఆలిండియా ముస్లిం పర్సనల్ లా బోర్డ్ ఆధ్వర్యాన స్థానిక జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో గురువారం మంగళగిరి తహశీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. వక్ఫ సవరణ చట్టం రాజ్యాంగ స్ఫూర్తికి వ్యతిరేకంగా ఉందని, రాజ్యాంగంలోని ఆర్టికల్ 14,25,26,29 ప్రకారం ప్రాథమిక హక్కులకు భంగం కలిగిస్తుందని, రాజ్యాంగం కల్పించిన మత స్వేచ్ఛకు విఘాతం కలిగిస్తుందని వివరించారు. ఈ సవరణలు వివక్షాత్మకంగా ఉన్నాయని ఇవి వక్ఫ ఆస్తుల రక్షణను తొలగిస్తున్నాయని, వక్ఫ బై యూజర్ లాంటి అనేక అంశాలను మెమోరాండంలో ప్రస్తావించడం జరిగింది. ఈ వక్ఫ సవరణ చట్టాన్ని వెంటనే రద్దు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మంగళగిరి జెఎసి కన్వీనర్ ముహమ్మద్ యూసుఫ్, సభ్యులు అబ్దుల్ రషీద్,అబ్దుల్ అజీమ్, బాబావలీ, ముహమ్మద్ దౌలా, ఫక్రుద్దీన్, నిజాముద్దీన్ పాల్గొన్నారు.

గడ్డి, ఆకులు తింటూ నిరసన వ్యక్తం చేసిన ఇంజనీరింగ్ కార్మికులు

గడ్డి, ఆకులు తింటూ మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల నిరసన

ప్రజాశక్తి - మంగళగిరి

రాష్ట్రవ్యాప్తంగా ఇంజనీరింగ్ కార్మికులు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మంగళగిరి కార్పొరేషన్ కార్యాలయం ఎదుట జరుగుతున్న నిరసన కార్యక్రమం గురువారం నాటికి నాలుగో రోజు చేరింది. ఈ సందర్భంగా కార్మికులు నోట్లో గడ్డి, ఆకులు పెట్టుకుని నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలని, జీవోల ప్రకారం వేతనాలు చెల్లించాలని, కనీస వేతనం 26 వేల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు వివి జవహర్లాల్, యు.దుర్గారావు, ఎం.బాలాజీ, ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.బాలకృష్ణ, యూనియన్ నాయకులు కె.శ్రీనివాసరావు, ఎం.శ్రీనివాసరావు, కేథార్‌నాథ్, ఎన్.ప్రకాష్, కె.దుర్గారావు, పి.రాము పాల్గొన్నారు.



సమ్మెలో పాల్గొన్న కార్మికులు

216వ రోజుకు ఎసిసి కార్మికుల దీక్షలు

ప్రజాశక్తి - తాడేపల్లి

ఎసిసి సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు తమకు రావాల్సిన బకాయిల కోసం చేస్తున్న దీక్షలు గురువారం నాటికి 216వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలను సీఐటీయూ తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల. దుర్గారావు, యూనియన్ కార్యదర్శి. కే. స్టీవెన్ ప్రారంభించారు. దీక్షలలో బొందలపాటి నవనీతమ్మ, దేరంగుల రమణమ్మ, మొలక శారదమ్మ, వేమురిబ్బా, ఉప్పు కాసమ్మలు కూర్చున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సిమెంట్ ఫ్యాక్టరీ సమస్యను ప్రభుత్వమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎం.ఆశీర్వాదం, వై.సాంబశివరావు, బి.సూర్యప్రకాశ రావు, షేక్ ఇస్మాయిల్, బి.అంకయ్య, తుపాకుల నాగేశ్వరరావు, షేక్ ఖాసీం, హగ్గయ్య తదితరులు పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మె 'ప్రజాశక్తి' ప్రత్యేక సంచిక ఆవిష్కరణ

ప్రజాశక్తి - తాడేపల్లి

జులై 9వ తేదీన దేశవ్యాప్తంగా జరగబోయే జాతీయ కార్మిక సమ్మె జయప్రదం చేసేందుకు ఈరోజు తాడేపల్లిలోని వేర్ హౌస్ గోడౌన్ ముఠా కార్మికుల వద్ద ప్రజాశక్తి ప్రచురించిన అఖిలభారత సారథ సమ్మె ప్రత్యేక సంచికను సిఐటియు నాయకులు వేముల దుర్గారావు, ఐఎఫ్‌టియు నాయకులు ఎం.చెన్నయ్య, ముఠా కార్మికులు కలిసి ప్రత్యేక సంచికను గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిఐటియు తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు మాట్లాడుతూప్రజాశక్తి ప్రత్యేక సంచికలో జాతీయ సమ్మె గురించి అనేక అంశాలు ఉన్నాయని చెప్పారు. సమ్మెలో కార్మికుల అందరూ పాల్గనాలని కోరారు. 9వ తేదీన తాడేపల్లి సాయి బాబా గుడి దగ్గర నుండి జరిగే కార్మిక ర్యాలీలో వేరే హౌస్ ముఠా కారులందరూ పాల్గొనాలని దుర్గారావు, చెన్నయ్య పిలుపునిచ్చారు. కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోట్లు తేవడం ద్వారా భారత కార్మిక వర్గాన్ని ద్రోహం చేయడమేనని విమర్శించారు. పెట్టుబడిదారులకు కార్పొరేట్ వ్యక్తులకు కార్మికుల శ్రమను కారు చౌకగా దోసి పెట్టడంతో పాటు దాచుకోవడానికి వీలుగా ఈ కార్మిక చట్టాలను సవరించారు అని ధ్వజ మెట్టారు. కనీస వేతనం 26,000 ఇవ్వాలని, ఎనిమిది గంటల పనిని కొనసాగించాలని, ప్రైవేటీకరణ ఆపాలని తదితర సమస్యల సాధన కోసం సాగే సమ్మెలో యావన్మంది కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, దుర్గారావు, చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

'ప్రజాశక్తి' ప్రత్యేక సంచికను ఆవిష్కరిస్తున్న సిఐటియు నాయకులు

కార్పొరేషన్ అధికారికి వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

పారిశుధ్య, ఇంజినీరింగ్ కార్మికుల వినతి

ప్రజాశక్తి - మంగళగిరి

కాజా గ్రామ పరిధిలోని ఇంజనీరింగ్ కార్మికులు, పారిశుధ్య కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గురువారం ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ కార్యాలయంలోని అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేషన్ అధికారి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఇవే వీలైనంతవరకు సమస్యలను పరిశీలిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు వి.వి.జవహర్‌లాల్, యు.దుర్గారావు, ఎం.బాలాజీ, ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.బాలకృష్ణ, కార్మికులు పాల్గొన్నారు.

ఆలయ భూమి కౌలు వేలం

ప్రజాశక్తి–ఈపూరు

మండల కేంద్రమైన ఈపూరు గ్రామంలో వీరభద్ర స్వామి ఆలయానికి సంబంధించిన పొలానికి దేవదాయశాఖ అధికారులు ఆలయ ప్రాంగణంలో గ్రామస్తుల సమక్షంలో గురువారం వేలంపాట నిర్వహించారు. దేవస్థాన కార్యనిర్వహణ అధికారి ఎ.శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ వీరభద్ర స్వామి ఆలయ పరిధిలో 10.50 ఎకరాలు ఉందని గతంలో రూ.2.54,000 లక్షలు ఉండగా పంటల సాగులో నష్టం రావడంతో ఈ ఏడాది రెండుసార్లు వేలం నిర్వహించినప్పటికీ రైతులు ముందుకు రాలేదని మూడోసారి జరిగిన వేలంలో సంవత్సర కాలానికి రూ.1,24,100 లక్షల వేలానికి ఏడుగురు రైతులు దక్కించుకున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో దేవదాయ శాఖ పర్యవేక్షణ అధికారి కె హనుమంతరావు, జూనియర్ అసిస్టెంట్ కోటేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రుల్లో కాన్పులను పెంచాలి

ప్రజాశక్తి–ఈపూరు

ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజలకు నమ్మకం కలిగేలా మెరుగైన వైద్య సేవలు అందించాలని పల్నాడు జిల్లా వైద్యాధికారి రవి అన్నారు.మండలంలోని ఎ ముప్పాళ్ళ గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రి పరిసరాలను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం వైద్యులతో మాట్లాడుతూ కాన్పుల శాతాన్ని పెంచాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ద్వారా లభిస్తున్న వైద్య సేవలపై చర్చించారు. సికిల్ సెల్, ఎనీమియా, పీఎంజేవై, యోగాంధ్ర పనులను రోజు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో వైద్యులు నవీన్ కుమార్, డిప్యూటీ హెచ్ఈఓ కె నాసరమ్మ పాల్గొన్నారు.

ఆలయంలో చోరీ

ప్రజాశక్తి – నకరికల్లు

త్రిపురపురం గ్రామంలోని దేవస్థానాలలో గుర్తు తెలియని వ్యక్తులు హుండీలను పగలగొట్టిన సంఘటన బుధవారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్ఐ సురేష్ తెలిపిన వివరాల ప్రకారం త్రిపురాపురం గ్రామ ఊరి బయట ఉన్న అంకాలమ్మ తల్లి, పోలేరమ్మ తల్లి, తిరుపతమ్మ తల్లి. పాటే పాటేశ్వరమ్మ తల్లి, దేవస్థానాలు వరుసగా ఉంటాయి. గురువారం ఉదయం ఆలయ పూజారి గుడి తలుపులు తెరవడానికి రాగా తాళాలు పగలగొట్టి ఉన్నాయి. గుర్తు తెలియని దొంగలు గర్భగుడుల్లోకి ప్రవేశించి ఆలయంలో ఉన్న హుండీలలోని రూ.5వేల నగదును దొంగిలించి ప్రాంగణంలో పడవేశారు. పల్నాడు జిల్లా క్లూస్ టీం సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. గ్రామస్తుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సురేష్ తెలిపారు.

వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ శ్రీనివాస్

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి–పల్నాడు జిల్లా

ఉచిత వైద్య శిబిరాలను పేద ప్రజల సద్వినియోగం చేసుకోవాలని శకుంతల జనరల్–గ్యాస్ట్రో–లివర్ కేర్ హాస్పిటల్ (డాక్టర్ దత్తు గారి హాస్పిటల్) అధినేత ప్రముఖ జనరల్, జీర్ణకోశ మరియు లివర్ వైద్య నిపుణులు డాక్టర్ ఐలా శ్రీనివాస్ అన్నారు. గురువారం తమ హాస్పిటల్ ఆధ్వర్యంలో నాదెండ్ల మండలం సాతులూరు గ్రామంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించిందన్నారు. వైద్య శిబిరంలో 80 మందికి పైగా రోగులకు గ్యాస్ట్రో, బిపి, షుగర్, థైరాయిడ్, జలుబు, దగ్గు, జ్వరానికి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ నరసరావుపేట పట్టణంలోని తమ హాస్పిటల్ లో హైదరాబాద్, విజయవాడ, గుంటూరు వంటి మహా నగరా లకు ధీటుగా మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నాంన్నా రు. గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు చేరువ చేయడానికి ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామని చెప్పారు.

సహకార సంఘాల బలోపేతంతోనే ఆర్థికాభివృద్ధి

జిల్లా సహకార శాఖ అధికారి నాగరాజు

మొక్కను నాటుతున్న నాగరాజు, ఇతర అధికారులు

ప్రజాశక్తి–నాదెండ్ల

సహకార సంఘాలు బలోపేతంగా ఉంటేనే రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందగలుగుతారని పల్నాడు జిల్లా సహకార శాఖ అధికారి ఎం.నాగరాజు అన్నారు. మండల కేంద్రమైన నాదెండ్ల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో అంతర్జాతీయ సహకార దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న నాగరాజు మాట్లాడుతూ రైతులు తాము సంపాదించిన సొమ్మును సహకార సంఘాల్లో డిపాజిట్ చేస్తే అధిక వడ్డీ లభిస్తుందని రైతులకు సూచించారు. సహకార సంఘాలు రైతులతో పాటు ఇతర వర్గాలకు కూడా సేవలు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. డిప్యూటీ రిజిస్ట్రార్ కె.తిరుపతయ్య మాట్లాడుతూ సంఘాలలో అక్రమాలకు తావు లేకుండా కంప్యూటీకరించామన్నారు. సబ్‌డివిజనల్ కోఆపరేటివ్ అధికారి ఎస్.చిన రామిరెడ్డి మాట్లాడుతూ ఐక్యరాజ్యసమితి ప్రపంచ ఆర్థిక మాంద్యం నుంచి బయట పడాలంటే సహకార సంఘాలను బలోపేతం చేయాలని తెలిపారు. అనంతరం కార్యాలయ ఆవ రణ లో మొక్కలు నాటారు. అధికారులు నాదెండ్ల పిఎసిఎస్ నిర్వహిస్తున్న జనరిక్ మెడికల్ షాపును సందర్శించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో పర్సన్ ఇంచార్జి సిహెచ్ స్వరూప, మాజీ అధ్యక్షులు నల్లమోతు హరిబాబు, నాదెండ్ల, గణపవరం సిఇఓలు సిహెచ్ ధనలక్ష్మి, పి.లక్ష్మయ్య రైతులు పాల్గొన్నారు.

ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రతిపాటి పుల్లారావు

2వ రోజు తొలి అడుగు కార్యక్రమం

ప్రజాశక్తి–చిలకలూరిపేట

నియోజకవర్గంలోని వాగుల్ని ఆధునీకరించి, వ్యవసాయానికి కీలకమైన లిఫ్ట్ ఇరిగేషన్ వ్యవస్థల్ని బాగు చేయాలని అసెంబ్లీ సాక్షిగా ముఖ్యమంత్రికి విన్నవించానని, ప్రభుత్వం సకాలంలో స్పందించి వాగుల్లోని కంపచెట్లు, పూడిక తీతకు రూ.2.50కోట్లు కేటాయించిందని శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు ఇంటింటి కీ తెలుగుదేశంలో భాగంగా గురువారం స్థానిక పసుమర్రులో పర్యటించారు. స్థానిక పశు వైద్యశాలలో నట్టల నివారణ మందు.. పశుగ్రాస విత్తనాల పంపిణీ ప్రారంభిం చిన అనంతరం, స్వయంగా ఎక్సకవేటర్ నడిపి ఓగేరు వాగు ఆధునికీకరణ పనుల్ని ప్రారంభించారు. అనంతరం గ్రామస్తు ల్ని ఉద్దేశించి మాట్లాడారు. గత ప్రభుత్వంలో జరిగిన నష్టాన్ని.. గత పాలకులు చేసిన విధ్వంసాన్ని మర్చిపోతే ఎలా గన్నారు. తల్లికి వందనం అమలు చేసిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనని, గత పాలకుల్లా తల్లుల్ని, విద్యార్థుల్ని, ప్రజల్ని మోసగించలేదని ప్రత్తిపాటి తెలిపారు. సూపర్–6 హామీల అమల్లో తల్లికి వందనం అమలైందని, అన్న దాతా సుఖీభవ. ఉచిత బస్సు ప్రయాణం, నిరుద్యోగ భృతి త్వరలోనే అమలు కానున్నాయన్నారు.

ప్రజాశక్తి – పెదకూరపాడు

ప్రజా సంక్షేమం, అభివృద్ధి ప్రభుత్వ లక్ష్యమని పెదకూరపాడు నియోజకవర్గ శాసనసభ్యులు భాష్యం ప్రవీణ్ అన్నారు. గురువారం మండలంలోని హుస్సేన్ నగరంలో జరిగిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలిసిన కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. రానున్న నాలుగేళ్లలో అమలు కానున్న సంక్షేమ పథకాలు, మౌలిక సదుపాయాలపై ప్రజలతో చర్చించారు. పెదకూరపాడు అభివృద్ధికి ఇది ప్రారంభం మాత్రమేనని రానున్న రోజుల్లో నియోజకవర్గ అభివద్ధి కోసం మరింతగా కషి చేస్తామని ప్రవీణ్ తెలిపారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకునే ప్రయత్నం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా టిడిపి కార్యదర్శి ఏ రమేష్, మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు ఏటుకూరి బ్రహ్మయ్య, హుస్సేనగరం నాయకులు నెల్లూరి మల్లికార్జునరావు, ఇంకా పలు గ్రామాల నాయకులు కార్యకర్తలు అధికారులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి – వెల్దుర్తి

కూటమి ప్రభుత్వం ఏడాది సుపరిపాలనలో ప్రజలు సంతప్తికరంగా ఉన్నారని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలో నిర్వహించిన సుపరిపాలనలో తొలిఅడుగు – ఇంటింటికి టీడీపీ కార్యక్రమంలో ఎమ్మెల్యే జూలకంటి పాల్గొన్నారు. ముందుగా గ్రామదేవత శ్రీ పోలేరమ్మ తల్లి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహింఎవనిఅ గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి కూటమి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నేతత్వంలో జరుగుతున్న అభివద్ధి, అందుతున్న సంక్షేమం గురించి గ్రామ ప్రజలకు వివరించారు. గత ప్రభుత్వంలో జరిగిన విధ్వంసం, దోపిడి, దౌర్జన్యాలను, జరిగిన ఆర్థిక ధ్వంసం వంటి వాటిని అధిగమించి, సీఎం చంద్రబాబు ఏ విధంగా ప్రజలకు సుపరిపాలన అందిస్తున్నారో చెప్పుకొచ్చారు.

ప్రజాశక్తి – సత్తెనపల్లి రూరల్

కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను 80 శాతం అమలు చేశామని సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. రాజుపాలెం మండలం అంచులవారి పాలెంగ్రామంలో రెండోరోజు సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఆయన నరసరావు పేట పార్లమెంట్ సభ్యులు లావు శ్రీకష్ణదేవరాయలు, పల్నాడు జిల్లా తెలుగు దేశం పార్టీ అధ్యక్షులు కొమ్మాలపాటి శ్రీధర్‌తో కలిసి గురు వారం పాల్గొన్నారు. మొదటి ఏడాదిలోనే అంచులవారిపాలెం గ్రామంలో 80 లక్షల రూపాయల అభివృద్ధి జరిగిందని తెలిపారు. ఎంపీ శ్రీకష్ణ దేవరాయలు మాట్లాడుతూ నాయకులు ప్రజలు ఉమ్మడిగా కలిసి పని చేసినప్పుడే అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. కార్యక్రమంలో టిడిపి రాజు పాలెం మండల పార్టీ అధ్యక్షులు అంచుల నరసింహారావు టిడిపి నాయకులు డి.నాగేశ్వరావు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటిలో సీట్లు సాధించిన విద్యార్థులకు అభినందన

ప్రజాశక్తి–పల్నాడు జిల్లా

అక్షరాస్యత పరంగా వెనుకబడిన పల్నాడు జిల్లా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అక్షరాస్యత శాతం పెరగడమే కాకుండా ఎస్ఎస్‌సి ఫలితాలలో రాష్ట్ర స్థాయిలో 598 మార్కుల తో పల్నాడు ప్రథమ స్థానంలో నిలపడం పట్ల అనన్య హాస్పిటల్స్, సాయికృష్ణ మల్టిస్పెషాలిటి హాస్పిటల్స్ అధినేత ప్రముఖ ఊపిరితిత్తుల వైద్యులు డాక్టర్ సింగరాజు సాయికష్ణ హర్షం వ్యక్తం చేశారు. నకరికల్లు మండలంలోని డాక్టర్ సాయికష్ణ స్వగ్రామం కుంకలగుంటలో గురువారం పర్యటించారు. రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన ట్రిపుల్ ఐటి ఎంట్రెన్స్ పరీక్షలలో అర్హత సాధించిన జడ్‌పి పాఠశాల విద్యార్థినిలకు అయిదుగురికి ఏర్పాటు చేసిన అభినందన సభలో పాల్గొన్నారు. విద్యార్థినిలకు మెమొంటోలను అందజేసి ప్రసంసించారు. విద్యార్థిని జి.రాధికకు రూ 5వేలు నగదు బహుకరించారు. ఫలితాలు ప్రభుత్వ పాఠశాలల పని తీరు, ఉత్తీర్ణత పరంగా 18 స్థానంలో ఉన్న పల్నాడు జిల్లాను 11వ స్థానంలోకి తీసుకురావడంతో ఉపాధ్యాయుల కృషిని కొనియాడారు. అనంతరం డాక్టర్ సాయికృష్ణ పాఠశాల ప్రధానోపాధ్యాయులు మేరీ రాణి, ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో స్కూల్ కమిటీ చైర్మన్ రామిశెట్టి హనుమయ్య, గ్రామ పెద్దలు సింగరాజు అంకారావు, సుబ్బయ్య, కోటయ్య, మహంకాళి రావు, సిద్దయ్య, దమ్మ వళం వెంకయ్య, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రోత్సాహక నగదు అందజేస్తున్న డాక్టర్ ఎస్.సాయికృష్ణ

కార్యకర్తలే పార్టీకి ఉక్కు కవచాలు

ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి

ప్రజాశక్తి–మాచర్ల

తెలుగుదేశం పార్టీకి పార్టీ కార్యకర్తలే ఉక్కు కవచాలు అని మాచర్ల శాసనసభ్యులు జూలకంటి బ్రహ్మానందరెడ్డి పునరుద్ఘాటించారు. గురువారం పట్టణంలోని మానుకొండ కళ్యాణమండపంలో మాచర్ల నియోజకవర్గం స్థాయి టిడిపి క్లస్టర్, యూనిట్, బూత్ లెవల్ ఇంచార్జుల సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే జూలకంటి కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలో లక్షల కోట్ల నిధులతో సాగుతున్న అభివృద్ధి, సంక్షేమాలను ప్రతి ఒక్కరికి వివరించాల్సిన బాధ్యత పసుపు సైన్యం పైనే ఉందని అన్నారు. పిన్నెల్లి సోదర్లులాగా పాపపు సొమ్ము పోగేసు కొనెలా అవినీతికి పాల్పడలేనని ఎమ్మెల్యే జూలకంటి అన్నారు. అన్నదమ్ములిద్దరూ దౌర్జన్యాలు, దోపిడి, కబ్జాలతో వేల కోట్లు పోగేసుకున్నారని, అవినీతికి నేను పాల్పడలేనని చెప్పారు. కార్యక్రమంలో నియోజకవర్గ స్థాయి క్లస్టర్, యూనిట్, బూత్ లెవెల్ ఇంచార్జులు, పార్టీసీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రుణాలు మంజూరు చేసి ప్రోత్సహించండి

ప్రజాశక్తి – అచ్చంపేట

ద్విచక్ర వాహనాలను మరమ్మతులు చేసి జీవనోపాధి పొందుతున్న వాహన కార్మికులకు ప్రభుత్వం రుణాలు మంజూరు చేసి ప్రోత్సహించాలంటూ అచ్చంపేట మండల వాహన కార్మికుల సంఘం అధ్యక్షుడు షేక్ నాగుల మేరా అన్నారు. ప్రపంచ వాహన కార్మికుల దినోత్సవం సందర్భంగా పల్నాడు జిల్లా సెక్రటరీ షేక్ మాబు ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి కార్మికులకు శుభాకాంక్షలు తెలిపారు. ఆయన మాట్లాడుతూ కార్మికులకు ప్రభుత్వం కాంప్లెక్స్ గదులు కట్టించి అద్దెలకు ఇవ్వాలనీ, సబ్సిడీ రుణాలు మంజూరు చేయాలనీ, నివాసస్థలాల్లో పక్కా ఇండ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కార్మికులు షరీఫ్ సుభానిచారి, అక్బర్,రఫీ ప్రదీప్ ఇమామ్‌వలి పాల్గొన్నారు.

ప్రజాశక్తి – నకరికల్లు

అంతర్జాతీయ మెకానిక్ డే సందర్భంగా నకరికల్లులోని మెకానికులు వై జంక్షన్ నుంచి సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మెకానికులు మాట్లాడారు. కార్మిక సంఘంలో గుర్తింపు ఇవ్వాలని నినాదాలు చేశారు. ప్రెసిడెంట్ షేక్ అల్లాబక్షు, వైస్ ప్రెసిడెంట్ షేక్. సుభాని, కార్యదర్శి సాయి, జాయింట్ సెక్రెటరీ, మోహన్, పాల్గొన్నారు.

అవార్డులను అందుకుంటున్న సురేఖ, లక్ష్మి

సేవకు గుర్తింపుగా అవార్డులు

రోటరీ డిప్యూటీ గవర్నర్ రామకోటయ్య

ప్రజాశక్తి – మాచర్ల

చేసిన సేవకు గుర్తింపునకు అవార్డులు దక్కటమేనని రోటరి క్లబ్ డిప్యూటి గవర్నర్ కె రామకోటయ్య అన్నారు. రోటరీ జిల్లా 3150కు సంబంధించి 2024–25 సంవత్సరానికి రోటరీ సేవా అవార్డుల ప్రధాన కార్యక్రమం హైదరాబాదులోని గౌరీ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా క్లబ్ స్థాయి విభాగంలో రోటరీ జిల్లా 3150 నిర్దేశించిన కార్యక్రమాల ద్వారా రెండు సిల్వర్, రెండు బ్రాంజ్ పతకాలను, క్లబ్ చేసిన ప్రత్యేక గుర్తింపు కలిగిన ప్రాజెక్టుల ద్వారా మరో రెండు అవార్డులను, క్లబ్బ్ నిర్వహించిన సేవా కార్యక్రమాలకు గుర్తింపుగా 8 సర్టిఫికెట్లను, రోటరీ క్లబ్ ఆఫ్ మాచర్ల అధ్యక్ష, కార్యదర్శులు కొండవీటి కృష్ణకుమారి, నిమ్మగడ్డ సురేఖ, ట్రెజరర్ అన్నపురెడ్డి లక్ష్మీకు డిప్యూటీ గవర్నర్ కొండవీటి రామకోటయ్య అందజేశారు. వీటితో పాటుగా వ్యక్తిగత అవార్డులలో భాగంగా అత్యున్నత సిల్వర్ అవార్డు పురస్కారాన్ని క్లబ్ కార్యదర్శి నిమ్మగడ్డ సురేఖ అందుకున్నారు. ఈ సందర్భంగా డిప్యూటి గవ్నర్ రామకోటయ్య మాట్లాడుతూ ఆవార్డులు మరింత బాధ్యతను పెంచుతాయని, క్లబ్‌ను మరింత ఉన్నతంగాతీర్చేదిదేందుకు క్లబ్ సభ్యులు ఐక్యంగా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో తుమ్మల సత్యప్రసాద్, ఆలేటి కోటేశ్వరరావు, కర్నాటి శ్రీనివాసరావు, పఠాన్ నాగుర్ వలి పాల్గొన్నారు.

పెండింగ్ కేసుల పరిష్కారానికే 'మీడియేషన్ ఫర్ ద నేషన్'

- రేపు నిర్వహించే రెండవ జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి
- రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ మెంబర్ సెక్రటరీ బి.ఎస్.వి. హిమబిందు

ప్రజాశక్తి - తుళ్లూరు

పెండింగ్‌లో ఉన్న కేసులను సత్వరమే పరిష్కరించాలనే లక్ష్యంతో సుప్రీంకోర్టు మీడియేషన్, కన్సిలియేషన్ ప్రాజెక్ట్ కమిటీ ఈ నెల 1 వ తేదీ నుండి 90 రోజుల పాటు నిర్వహిస్తున్న దేశవ్యాప్త మధ్యవర్తిత్వ క్యాంఫైన్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర న్యారు సేవాధికార సంస్థ మెంబర్ సెక్రటరీ (డిస్ట్రిక్టు అండ్ సెషన్స్ జడ్జి) బి.ఎస్.వి.హిమబిందు కోరారు. బుధవారం రాష్ట్ర సచివాలయం సమీపంలోని రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయంలో ఆమె విలేకరులతో మాట్లాడుతూ మీడియేషన్ ఫర్ ద నేషన్ క్యాంపయిన్, లోక్ అదాలత్ ద్వారా కేసులను రాజీ చేసుకుంటే ఇరు పక్షాలు విజయం సాధించినట్లే అన్నారు. మధ్యవర్తిత్వం ద్వారా కేసులను పరిష్కరించుకునేందుకు ఈ నెల 1 వ తేదీ నుండి సెప్టెంబర్ 30 వ తేదీ వరకు 90 రోజులపాటు దేశవ్యాప్తంగా మీడియేషన్ ఫర్ ద నేషన్ క్యాంపెయిన్‌ను నిర్వహిస్తున్నామన్నారు. జులైలో పరిష్కరించ దగ్గ కేసులను గుర్తించి, మధ్యవర్తిత్వం ద్వారా వాటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఇందుకోసం మధ్యవర్తిత్వంలో శిక్షణ పొందిన దాదాపు 893 మంది విశ్రాంత న్యాయమూర్తులు, సమాజ సేవకులు, న్యాయవాదులకు ఆయా కేసులను అప్పగించి, వారి మధ్యవర్తిత్వంలో పరిష్కారమైన కేసులకు కోర్టులో రాజీ మార్గంలో తీర్పు ఇస్తామన్నారు. సాధారణంగా ఏ కోర్టులో అయినా తీర్పు చెపితే,ఎవరో ఒకరు మాత్రమే విజయం సాధించే అవకాశం ఉంటుందని, మధ్యవర్తిత్వం ద్వారా లేదా లోక్ అదాలత్ ద్వారా గాని పరిష్కరించుకున్నట్లైతే కక్షిదారులు ఇరువురూ విజయం సాధిస్తారన్నారు. అదే విధంగా జాతీయ న్యాయసేవాధికారి సంస్థ ఆదేశాల మేరకు ఏడాదికి 3 నుండి 4 జాతీయ లోక్ అథాలత్‌లను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా ఈ నెల 5 వ తేదీన 2వ జాతీయ లోక్ అథాలత్‌ను రాష్ట్రంలోని అన్ని న్యాయస్థానాల్లోనూ, హైకోర్టులోనూ, విశాఖపట్నంలోని డెట్ రికవరీ ట్రిబ్యునల్ లోనూ అథాలత్ లను నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు.

మాట్లాడుతున్న బి.ఎస్.వి. హిమబిందు

రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఉప కార్యదర్శి డాక్టర్ హెచ్.అమర రంగేశ్వర రావు మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ప్యాటర్న్ ఇన్ చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ జస్టిస్ రవీనాథ్ తిలహరి మార్గదర్శకత్వంలో వారి సూచనల మేరకు జాతీయ లోక్ అథాలత్‌ను నిర్వహిస్తామని తెలిపారు. సహాయ కార్యదర్శి ఎన్.జె.రావు సమావేశంలో పాల్గొన్నారు.

విజయ్‌రాజ్‌ను సన్మానిస్తున్న తోటి ఉపాధ్యాయులు

ఉపాధ్యాయుడు విజయ్‌రాజుకు వీడ్కోలు

ప్రజాశక్తి - చేబ్రోలు

ఉపాధ్యాయుడు కోడూరు విజయ రాజుకు గ్రామస్తులు పేరెంట్స్, పేరెంట్స్ కమిటీ విద్యార్థులు ఉపాధ్యాయులు ఘనంగా వీడ్కోలు పలికారు. మండలంలోని చీలిపాలెం గ్రామంలో ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వర్తిస్తున్న విజయరాజు సాధారణ బదిలీలలో భాగంగా మరొక పాఠశాలకు బదిలీ అయ్యారు. ప్రధానోపాధ్యాయులు ఎస్.కె.తెహరున్నీసా మాట్లాడుతూ విజయరాజు అత్యుత్తమ విద్యాబోధన చేశారని కొనియాడారు. కార్యక్రమంలో అతిథిగా పాల్గొన్న పులి ప్రభుదాసు మాట్లాడుతూ పాఠశాలకు, విద్యార్థులకు ఉత్తమ సేవలు అందించిన విజయరాజు ఈరోజు బదిలీపై ఏపాఠశాలకు వెళ్లినా అక్కడ అకుంఠత దీక్షతో పట్టుదలతో పనిచేసే వ్యక్తి అని అన్నారు. అందరి మంచి కోరుకునే విజయ రాజు భవిష్యత్తులో ఎంతో మంది వ్యక్తులను ఆస్తిగా సంపాదించుకుంటారని అభినందించి కొనియాడారు. కార్యక్రమంలో తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ సభ్యులు ఉపాధ్యాయులు విద్యార్థులు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

చిలువూరులో పాఠశాలను పరిశీలిస్తున్న మండల విద్యాధికారి లక్ష్మీనారాయణ

నూతనంగా 530 విద్యార్థుల చేరిక

ప్రజాశక్తి - దుగ్గిరాల

మండల వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో 530 మంది పిల్లలు కొత్తగా ఒకటో తరగతిలో చేరినట్లు మండల విద్యాధికారి ఎంఈఓ2 కె.లక్ష్మీనారాయణ తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో 245 మంది ప్రైవేట్ పాఠశాలలు 285 మంది చేరినట్లు ఆయన తెలిపారు. కొత్తగా చేరిన వారందరికీ ఈనెల 10వ తేదీన మెగా తల్లితండ్రుల సమావేశం సందర్భంగా తల్లికి వందనం పథకం కింద తల్లుల ఖాతాలో డబ్బులు జమ అవుతాయని తెలిపారు. గురువారం మండలంలోని చిలువూరు గ్రామంలో ఉన్న మూడు ఎలిమెంటరీ పాఠశాలలను పర్యటించారు. ఈ సందర్భంగా సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్రకు సంబందించిన మెటీరియల్స్ విద్యార్థులకు సక్రమంగా అందించాలని సూచించరు. రికార్డులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు ఖాలిదా ఖాతూన్, సిబ్బంది పాల్గొన్నారు.

ఐపిఎస్ఎఫ్, ఎన్ఇసికి ఎఎస్ఎన్ ఫార్మశీ విద్యార్థుల ఎంపిక

ప్రజాశక్తి - తెనాలి

ఇండియన్ ఫార్మా స్యూటికల్ అసోసియేషన్ స్టూడెంట్స్ ఫోరం, నేషనల్ ఎగ్జిక్యూటివ్ కమిటీకి స్థానిక ఏఎస్ఎన్ ఫార్మసీ కళాశాల విద్యార్థులు ఎంపికయ్యారు. 2025-2026 సంవత్సరానికి గాను ఎంపికైన విద్యార్థులను కళాశాల సెమినార్ హాల్‌లో గురువారం ఘనంగా అభినందించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.వెంకటరమణ అధ్యక్షతన జరిగిన అభినందన సభలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులు నేషనల్ కమిటీకి ఎంపిక కావడం కళాశాలకే గర్వకారణమన్నారు. విద్యార్థులు నాయకత్వ స్థాయికి చేరడం తేలిక కాదన్నారు. ఎంపికైన ముగ్గురు విద్యార్థులకు కళాశాల తరపున మోమెంటోలు అందించి ఘనంగా సత్కరించారు. మెయిన్ కమిటీ జాయింట్ సెక్రటరీగా ఎన్. రోహిత్, పబ్లిక్ లైజాన్స్ సబ్ కమిటీ సౌత్ డివిజన్ హెడ్గా హిమజా సోమిశెట్టి, సౌత్ డిజైన్ పబ్లిక్ లైసెన్స్ కమిటీ ప్రాజెక్టు కమిటీ సభ్యురాలిగా టి.పూజిత ఎంపికైనట్లు తెలిపారు. విద్యార్థులను అభినందించిన వారిలో చాప్టర్ మెంటర్ పి. భార్గవి, చాప్టర్ ప్రెసిడెంట్ డాక్టర్ సునీల్ కుమార్, అధ్యాపకులు, ఐపీఎస్ఎఫ్ ఏఎస్ఎన్ సభ్యులు పాల్గొన్నారు.

ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపల్

బాల్యవివాహాల నిర్మూలనలో ప్రతిఒక్కరూ భాగస్వామ్యం కావాలి

అవగాహన కల్పిస్తున్న కళాజాత బృందం

ప్రజాశక్తి -మేడికొండూరు

మేడికొండూరు, మంగళగిరిపాడు గ్రామాల్లో చైల్డ్ రైట్స్ అడ్వొకేసీ ఫౌండేషన్ - క్రాఫ్ ఆధ్వర్యంలో బాల్య వివాహ వ్యతిరేక ప్రచారోద్యమం వీధి నాటక ప్రదర్శన కార్యక్రమం బుధవారం నిర్వహించారు. కార్యక్రమంలో ఫిరంగిపురం ఐ.సి.డి.ఎస్ ప్రాజెక్ట్ సిడిపిఓ, ఎం.అనురాధ మాట్లాడుతూ బాల్య వివాహాలు అరికట్టేందుకు సామాజిక మార్పు తీసుకువచ్చే కార్యక్రమాలు రూపొందించి అమలు చేయాలని, ఇలాంటి వీధి నాటకాల వలన సమాజంలో ఉన్న సాంఘిక దురాచారాలు తొలగించి, బాలల అభివృద్ధి కోసం అందరం పని చేయాలన్నారు. గ్రామాలలో బాల్య వివాహాలు జరగకుండా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మేడికొండూరు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.జయప్రద మాట్లాడుతూ నేడు సమాజంలో బాలికలపై అనేక రకాల వివక్షలు జరుగుతున్నాయని, వాటిని అరికట్టవలసిన బాధ్యత అందరిపై ఉందని అన్నారు. ఎవరైనా గ్రామాలలో బాల్య వివాహం చేయాలని చూస్తే వెంటనే గ్రామ మహిళా సంరక్షణ కార్యదర్శికి, గ్రామ సెక్రెటరీకి రెవెన్యూ ఆఫీసర్‌కి తెలియజేయాలని, చైల్డ్ హెల్ప్ లైన్ 1098, పోలీస్ హెల్ప్ లైన్ 100, టోల్ ఫ్రీ నెంబర్ 112 కి తెలియజేయాలని సూచించారు. ఫిరంగిపురం ఐ.సి.డి.ఎస్ ప్రాజెక్ట్, మేడికొండూరు సెక్టార్ సూపర్‌వైజర్ మాట్లాడారు. కార్యక్రమంలో క్రాఫ్ జిల్లా కో-ఆర్డినేటర్ జి.వెంకట్, ఫిరంగిపురం ఐ.సి.డి.ఎస్ ప్రాజెక్ట్, మేడికొండూరు సెక్టార్ సూపర్వైజర్ డి. సునీత, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు, సిబ్బంది మోహన్‌రావు, శ్రీనివాసరావు, సుభాషిని, శాంతి శ్రీ, పద్మజా, శైలజా, కుమారి, జేమ్స్, డ్వాక్రా యానిమేటర్స్ డ్వాక్రా లీడర్స్, స్కూల్ మేనేజ్మెంట్ కమిటీ మెంబర్స్, వీధి నాటక కళాబఅందం సభ్యులు రవి కుమార్, రాము, రంగనాయకి, శ్రావణి, మహేష్, చిన్ని, పలువురు విద్యార్థిని విద్యార్థులు అధ్యాపక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై మహిళలకు అవగాహన

ప్రజాశక్తి - చేబ్రోలు

డిపాజిటర్స్ ఎడ్యుకేషన్ అండ్ అవేర్నెస్ (డి ఈ ఎ) కార్యక్రమాన్ని గురువారం స్థానిక చేబ్రోలు మండల అభివృద్ధి కార్యాలయం మీటింగ్ హాలులో నిర్వహించారు. లిటరసీ, అగ్రికల్చర్ అండ్ మెడికల్ ప్రాజెక్ట్ ఫర్ రూరల్ డెవలప్మెంట్ (ఎల్ ఎ ఎం పి) సంస్థ ఆధ్వర్యంలో రిజర్వ్ బ్యాంకు సౌజన్యంతో ఈ సదస్సు నిర్వహించినట్లు లాంప్ సంస్థ డైరెక్టర్ కొండపల్లి సాల్మన్ పాల్ తెలిపారు. మండల అభివృద్ధి అధికారి మాట్లాడుతూ ప్రతి వ్యక్తి సంపాదనలో 20 శాతం పొదుపు చేయడం అనేది భారతీయ రిజర్వ్ బ్యాంకు ముఖ్య ఉద్దేశ్యమని, దీని పై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని ఆర్థిక అభివృద్ధి సాధించాలని చేబ్రోలు మండల అభివఅద్ధి అధికారి టి ఊహా రాణి అన్నారు. డైరెక్టర్ కొండపల్లి సాల్మన్ పాల్ . స్థానిక యూనియన్ బ్యాంకు మేనేజర్ వెంకటేశ్వర్లు. గ్రామీణ బ్యాంకు ఫీల్డ్ ఆఫీసర్ సంధ్య, వెలుగు ఏపిఎం శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వర్క్‌షాపులో పాల్గొన్న అధికారులు

పదరక్షలు అందజేస్తున్న చైర్‌పర్సన్

పారిశుధ్య కార్మికులకు చెప్పులు పంపిణీ

ప్రజాశక్తి - తెనాలి

పురపాలక సంఘంలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు పాదరక్షలు పంపిణీ చేశారు. మున్సిపల్ కమిషనర్ (ఎఫ్ఎసి) వి.లక్ష్మీపతి రావు అధ్యక్షతన గురువారం నిర్వహించిన కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ తాడిబోయిన రాధిక ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. పురపాలక సంఘంలో పీహెచ్, నాన్ పీహెచ్ కార్మికులకు రెండు జతల చొప్పున పాదరక్షలు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పట్టణాన్ని శుభ్రంగా ఉంచేందుకు పరిస్థితి కార్మికులు కఅషి చేస్తున్నారని, వారి శ్రమ మాటలలో వెల్లడించలేనిదని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ ఎం.ఏసుబాబు, మున్సిపల్ ఇంజనీర్ శ్రీకాంత్, అసిస్టెంట్ సిటీ ప్లానర్ శ్రీమన్నారాయణ శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, శానిటేషన్ సెక్రటరీలు, ఎఫ్1 గుమస్తా ఉమా శంకర్ పాల్గొన్నారు.

మెకానిక్‌ల సమస్యలను పరిష్కరించాలి

ప్రజాశక్తి - మంగళగిరి

ప్రపంచ మెకానిక్ డే సందర్భంగా గురువారం మంగళగిరిలో టూ వీలర్స్ మెకానిక్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శ్రామికులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంబేద్కర్ సెంటర్లో మెకానికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని అసోసియేషన్ నాయకులు కోరారు. ప్రతి టూ వీలర్ మెకానిక్ కార్మిక శాఖ ద్వారా ప్రభుత్వ గుర్తింపు కార్డు ఇవ్వాలని, రాష్ట్ర ప్రభుత్వం వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని అన్నారు. 55 సంవత్సరాలు దాటిన అర్హులైన పేదవారైన మెకానికులకు వెల్ఫేర్ బోర్డు ద్వారా ప్రతినెల కనీసం 5000 రూపాయలు పెన్షన్ సౌకర్యం కల్పించాలని కోరారు. ఈ సమస్యలను మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకెళ్లడం జరుగుతుందని అన్నారు. అనంతరం తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్రామికుల టూ వీలర్స్ మెకానిక్ వెల్ఫేర్ అసోసియేషన్ గౌరవాధ్యక్షులు షేక్ సలీం, అసోసియేషన్ నాయకులు బి.వాసు, టి.వి.సుబ్బారావు, జి.రామకృష్ణ, ధర్మారావు, పటాన్ గౌస్, జి.వీరాంజనేయులు, పి.శివ శంకర్ బాబు పాల్గొన్నారు.

జోరుగా ఎరువుల విక్రయాలు

ప్రజాశక్తి - దుగ్గిరాల

ఇటీవల కురుస్తున్న వర్షాలకు అన్నదాతలు ఖరీఫ్ కు శ్రీకారం చుట్టారు. వర్షానికి భూములు తడిసి దున్నటానికి అనువుగా ఉండటంతో మండల పరిధిలోని గ్రామాల్లో ఎద పద్ధతిన విత్తనాలు చల్లు తున్నారు. ముందస్తు విత్తనాలు చల్లిన పొలాలను మోటార్ల ద్వారా డీజిల్ ఇంజన్ల ద్వారా నీటి తడుపులు అందిస్తున్నారు. మరో ప్రక్క ముందస్తు ఎరువులు కొనుగోలు చేస్తున్నారు. ప్రస్తుతానికి డిఏపీ తప్ప అన్ని రకాల ఎరువులు అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రస్తుతం అన్ని రకాల ఎరువులు అందుబాటులో ఉన్నాయి. మండల వ్యాప్తంగా 22 వేల ఎకరాలలో మాగాణి భూములు ఉన్నాయి.

సంచార మెడికల్ క్యాంపునకు స్పందన

ప్రజాశక్తి - దుగ్గిరాల

రాష్ట్ర ఐటీ మరియు విద్యాశాఖ మంత్రి మంగళగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే నారా లోకేష్ సహకారంతో మంగళగిరి నియోజకవర్గంలో ఎన్నికల ముందు ఏర్పాటుచేసిన సంజీవని ఆరోగ్య రథ తన సేవలను కొనసాగిస్తూ గురువారం మండల కేంద్రం దుగ్గిరాలలోని అలీ నగర్ లో మెడికల్ క్యాంప్ నిర్వహించారు. దాదాపు 100 మందికి వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఆసుపత్రికి వెళ్లకుండా తమ ప్రాంతంలో వైద్య సేవలు అందించడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వి సాయి రాజేష్ మరియు సిబ్బంది వైద్య సేవలు అందించారు.

ఆర్‌విఆర్ జెసిలో ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ ప్రారంభం

ప్రజాశక్తి-గుంటూరు

మాట్లాడుతున్న డాక్టర్ సుప్రభా

నూతన ఆవిష్కరణల విషయంలో భవిష్యత్‌లో విద్యార్థుల్లో పోటీ పెరగనున్నదని, దేశ ఆర్థిక పురోగతికి వినూత్న ఆవిష్కరణలే కీలకంగా మారనున్నా యని, అందుకు తగ్గట్టు అధ్యాపక బృందం విద్యార్థులకు తగిన శిక్షణతో ప్రోత్సహించే విధంగా తయారవ్వాలని కర్ణాటక నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అసోసియేట్ ప్రొఫెసర్, వాద్వాని ఫౌండేషన్ గ్లోబల్ జ్యూరీ మెంబెర్ డాక్టర్ కె.ఆర్.సుప్రభా అన్నారు. ఆర్‌విఆర్ అండ్ జెసి ఇంజినీరింగ్ కాలేజిలో ఎస్‌టిపి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఐటిబిఐ సహకారంతో మూడ్రోజులపాటు డిజైన్ అండ్ ఎంట్రప్రెన్యూర్‌షిప్‌పై ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌ను సుప్రభా ప్రారంభించారు. రాష్ట్రంలోని వివిధ కళాశాలల నుండి అధ్యాపకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. డాక్టర్ సుప్రభా మాట్లాడుతూ విద్యావేత్తలకు, పరిశోధకులకు, యువ అధ్యాపకులకు ఆవిష్కరణాత్మక ఆలోచనలు, అభివద్ధి చెందిన డిజైన్ పద్ధతులు, స్టార్టప్ వ్యాపారాల ప్రారంభానికి అవసరమైన ఎంట్రిప్రెన్యూర్‌షిప్ నైపుణ్యాలపై లోతైన అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్, డైరెక్టర్లు, అధ్యాపకులు పాల్గొన్నారు.

సైబర్ సెక్యూరిటీపై హిందూ ఫార్మసీలో సదస్సు

ప్రజాశక్తి-గుంటూరు

మాట్లాడుతున్న డిఎస్‌పి అరవిందకుమార్

స్థానిక అమరావతి రోడ్డులోని హిందూ ఫార్మసీ కళాశాలలో గురువారం ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో సైబర్ సెక్యూరిటీపై అవగాహనా సదస్సు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.వి నాగభూషణం అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో డిఎస్‌పి అరవిందకుమార్ షేర్ మార్కెట్, లోన్ యాప్స్, వివిధ ఉపాధి రంగాలలో జరిగే మోసాలను గురించి, వాటి నుంచి రక్షణ పొందటానికి తీసుకోవలసిన జాగ్రత్తల గురించి విద్యార్థులకు వివరించారు. ఇలాంటి మోసాలను గురించి ప్రభుత్వం ఏర్పాటు చేసిన 1930 నెంబర్‌కు ఫోన్ చేసినప్పుడు వారు తగిన చర్యలు తీసుకుంటామని అన్నారు. విద్యార్థులు ఆల్కహాల్, పొగాకు, గంజాయి, మార్ఫిన్ లాంటి మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు. మత్తు మందులకు అలవాటు పడితే విద్యార్థుల ఆరోగ్యానికి హాని చేకూరుస్తుందని తెలియచేశారు. కార్యక్రమంలో సిఐ ఆరోగ్యరాజు, కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజు, కార్యదర్శి డాక్టర్ ఎస్.మధుసూదనరావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ పి.సీతారామయ్య, జె.శివజ్యోతి, సి.హెచ్ ప్రసాదరావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉచిత ఇసుకకు తూట్లు పొడుస్తున్న అధికారులు

గుంటూరులో లారీ యజమానుల ధర్నా

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

ధర్నాలో పాల్గొన్న లారీ యజమానులు

రవాణా శాఖ అధికారులు, పోలీసులు కలిసి ఉచిత ఇసుక విధానానికి గండి కొడ్తున్నారని గుంటూరు, పల్నాడు జిల్లాల్లో ఇసుక సరఫరా చేసే లారీల యజమానులు గురువారం స్థానిక గోరంట్ల వద్ద తమ వాహనాలను నిలిపివేసి ధర్నా నిర్వహించారు. ఒక్కొ లారీకి రూ.18 వేలు రవాణా శాఖ అధికారులకు, రూ.3 వేలు పోలీసులకు ఇస్తున్నామని లారీల యజమానులు తెలిపారు. ఇందువల్ల తాము ప్రభుత్వం ఆశించిన విధంగా ఇసుక సరఫరా చేయలేకపోతున్నామని వారు చెప్పారు. మనిషిని బట్టి ఇసుక రీచ్ లలో ధరలు నిర్ణయిస్తున్నారన్నారు. బిల్లులు అడిగితే మేము ఇవ్వము మీకు చేతనైనది చేసుకోమని సమాధానం చెబుతున్నారన్నారు. కూటమి ప్రభుత్వంలోని కీలక నేతల అండదండలు ఉన్నాయని రీచ్ యజమానులు బాహాటంగా చెబుతున్నారని తెలిపారు. గుంటూరులోని 400 లారీలు పల్నాడు, గుంటూరు జిల్లాల్లో ఇసుక సరఫరాలో పాల్గొంటు న్నాయన్నారు. తాము రవాణా, పోలీసు శాఖ అధికారులకు డబ్బులు ఇస్తున్నా తమపై అక్రమ కేసులు పెడుతున్నారని తెలిపారు. రాయపూడి, లింగాయపాలెం, గుడిమెడ, మల్లాది, కోనూరు, మున్నంగి తదితర రీచ్‌లలో ఇదే విధానం కొనసాగుతుందన్నారు. ఇసుక రీచ్ లలో దోపిడీతో లారీలు నడపలేమని లారీ ఓనర్స్, డ్రైవర్‌లు ఆందోళనలో పాల్గొన్నారు. మరో వైపు మైనింగ్ అధికారులకు కూడా మామాళ్ల తప్పడం లేదన్నారు. ఇసుక రీచ్ లలో 40 టన్నులు ఇసుక ఎత్తి 20 టన్నుల కే బిల్లులు ఇస్తున్నారన్నారు. ఆర్టీవో అధికారులు వాహనాలను ఆపి 50,000 ఫైన్ వేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 40 టన్నుల కు బిల్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మైనింగ్ అధికారులు ఒక్కొక్కరి వద్ద నుండి లారీకి 4 వేల నుండి 7500 వరకు వసూలు చేస్తున్నారని ఆరోపించారు.

అమరావతి రోడ్డు గోరంట్ల వద్ద నిలిపివేసిన లారీలు

ఎల్ఐసిని నిర్వీర్యం చేసే విధానాలు విడనాడాలి

సౌత్ సెంట్రల్ జోన్ ఇన్సూరెన్స్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి కిషోర్‌కుమార్

ప్రజాశక్తి-గుంటూరు

సమావేశంలో మాట్లాడుతున్న కిషోర్‌కుమార్

కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ఉద్యోగ, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా జులై 9న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో 85 శాతంకుపైగా ఎల్ఐసి ఉద్యోగులకు ప్రాతినిధ్యం వహిస్తున్న ఆలిండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయీస్ అసిసోసియేషన్ కూడా పాల్గొంటున్నట్లు సౌత్ సెంట్రల్ జోన్ ఇన్సూరెన్స్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ సంయుక్త కార్యదర్శి జి.కిషోర్‌కుమార్ తెలిపారు. గురువారం స్థానిక అరండల్‌పేటలోని ఎల్ఐసి కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో కిషోర్‌కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ రంగ ఎల్ఐసిని బలహీనపరిచే విధానాలను విడనాడాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ విధానాలు ప్రజల పొదుపును నిరుత్సాహ పరిచేవిధంగా ఉన్నాయన్నారు. బీమా రంగంలో విదేశీ పెట్టుబడులను 74 శాతం నుండి వందశాతానికి పెంచాలనే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని, ఎల్ఐసి ఐపిఒ ప్రక్రియను నిలిపివేయాలని, ఎల్ఐసిలో వేల సంఖ్యలో ఉన్న ఖాళీలను భర్తీ చేయాలని, క్లాస్ 3,4 క్యాడర్ల లో రిక్రూట్ మెంట్ వెంటనే చేపట్టాలని, నూతన పెన్షన్ స్కీమ్ రద్దు చేసి, ఓపిఎస్ అమలు చేయాలని, బీమా ప్రీమియంపై జిఎస్‌టి పూర్తిగా రద్దు చేయాలని తదితర డిమాండ్లపై సమ్మెలో పాల్గొంటున్నట్లు చెప్పారు. ప్రజలు కష్టపడి రూపాయి రూపాయి దాచుకుంటుంటే అటువంటి వారిపై జిఎస్‌టి విధించటం దారుణం అన్నారు. విదేశాలలో విఫలమైన బీమా కంపెనీలను ఎఫ్‌డిఐల పేరుతో దేశంలోకి తీసుకురావాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు. ఉద్యోగులు దాచుకున్న పెన్షన్ నిధులను స్టాక్ మార్కెట్లకు తరలించడం నష్టదాయకం. ఫెడరేషన్ మచిలీపట్నం డివిజన్ సంయుక్త కార్యదర్శి వివికె.సురేష్ మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా పోరాటాలు చేసి సాధించుకున్న కార్మిక హక్కులను ప్రభుత్వం కాలరాస్తోందని, 40 కార్మిక చట్టాలను ఏకపక్షంగా రద్దు చేసి, బడా పారిశ్రామిక వేత్తలకు అనుకూలంగా నూతన లేబర్ కోడ్‌లను తెచ్చారని అన్నారు. లేబర్ కోడ్‌ల రద్దు, కనీస వేతనం రూ.26వేలకు పెంపు తదితర డిమాండ్లతో జరిగే సమ్మెలో ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. సమావేశంలో యూనియన్ నాయకులు ఆర్‌విఎస్ శ్రీనివాస్, డి.సైదులు, ఐ.వెంకట్రావు, జి.శివరామ కృష్ణారావు, పి.ఆర్.రాజశేఖర్, ఎం.రాజేశ్వరరావు పాల్గొన్నారు.

9న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-గుంటూరు

మాట్లాడుతున్న లక్ష్మణరావు

నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ జులై 9న దేశవ్యాప్తంగా జరగనున్న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని, కార్మిక, ప్రజాసంఘాలు పిలుపునిచ్చాయి. సమ్మె జయప్రదం చేయాలని కోరుతూ స్థానిక కొత్తపేటలోని మల్లయ్య లింగం భవన్‌లో రౌండ్ టేబుల్ సమావేశం ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు ఆకేటి అరుణ్ కుమార్, సిఐటియు నగర కార్యదర్శి కె శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించారు. కార్మిక, రైతు, విద్యార్థి, యువజన, ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు. ఏఐటీయూసీ రాష్ట్ర గౌరవాధ్యక్షులు వెలుగూరి రాధాకృష్ణమూర్తి, సిఐటియు జిల్లా అధ్యక్షులు బి.లక్ష్మణరావు మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి కార్మికులు, రైతు వ్యతిరేక విధానాలను పెద్ద ఎత్తున అమలు చేస్తుందన్నారు. కార్పొరేట్ శక్తులతో కుమ్మక్కై నాలుగు లేబర్ కోడ్లను తీసుకువచ్చిందన్నారు. రైతులకు వ్యతిరేకంగా మూడు నల్ల చట్టాలను తీసుకువచ్చే, రైతుల్లో వ్యతిరేకత కారణంగా తాత్కాలికంగా ఉపసంహరించుకుందని, ఆ తర్వాత దొడ్డిదారిన నూతన వ్యవసాయ చట్టాలు అమలు చేస్తుందన్నారు. గిట్టుబాటు ధరల చట్టం హామీని విస్మరించిందన్నారు. నిరుద్యోగం పెరిగిందని, ధరలు ఆకాశాన్ని అంటున్నాయని, కార్మికులకు కనీస వేతనాలు అమలు కావట్లేదన్నారు. ఈ నేపథ్యంలో జరుగుతున్న సమ్మెలో జిల్లాలో కార్మికులు, కర్షకులు, ఉద్యోగులు, పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సిఐటియు నాయకులు రమణ, మస్తాన్‌వలి, మెడికల్ రిప్రజెంటేటివ్స్ యూనియన్ నాయకులు సలీమ్, ఎఐటియుసి జిల్లా కార్యదర్శి మేడా హనుమంతరావు, బ్యాంకు ఉద్యోగుల సంఘం నాయకులు కిషోర్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఈమని అప్పారావు, రైతు సంఘం నాయకులు కొల్లి రంగారెడ్డి, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఎఐ నేటి అవసరంగా మారిపోయింది

ప్రజాశక్తి-గుంటూరు

గంటా సుబ్బారావుతో లావు రత్తయ్య, వీసీ తదితరులు

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అనేది భవిష్యత్‌ను మలచే సాధనం మాత్రమే కాదని, నేటి అవసరంగా మారిపోయిందని ఏపీఎస్ఎస్‌డీసీ మాజీ సీఈవో, ఎండీ గంటా సుబ్బారావు అన్నారు. విద్యార్థులు ఏ విభాగంలో ఉన్నా ఏఐపై ప్రాథమిక అవగాహన కలిగి ఉండాలన్నారు. వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో 'ఇంటరాక్టివ్ సెషన్ ఆన్ ఏఐ ఫోకస్డ్ యూనివర్సిటీ' అనే అంశంపై ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. గంటా సుబ్బారావు మాట్లాడుతూ ఆధునిక సాంకేతిక యుగంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ప్రాముఖ్యత దినదినాభివద్ధి చెందుతోందన్నారు. పరిశ్రమలే కాకుండా, విద్య, ఆరోగ్యం, వ్యవసాయం, న్యాయవ్యవస్థ, ప్రజాసేవ వంటి అన్ని రంగాల్లో ఏఐ విస్తతంగా విస్తరిస్తోందన్నారు. అందుకు అనుగుణంగా విజ్ఞాన్స్ యూనివర్సిటీలో అందుబాటులో ఉన్న కోర్సులు విద్యార్థులలో సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించడమే కాకుండా, పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా వారిని సిద్ధం చేయడం చాలా మంచి విషయమన్నారు. ఐఐటీ మద్రాస్ పూర్వ రిజిస్ట్రార్, ప్రొఫెసర్ ఎన్.శివప్రసాద్ మాట్లాడుతూ విద్యా విధానాలను పూర్తి స్థాయిలో డేటా ఆధారంగా రూపుదిద్దడం, విద్యార్థుల వ్యక్తిగత అవసరాలకు తగిన విధంగా అభ్యాసాన్ని మలచడం, విద్యాసంస్థల నిర్వహణలో ఏఐ వినియోగంపై అధ్యాపకులు దృష్టి సారించాలన్నారు. ఏఐ, డేటా సైన్స్, మరియు డిజిటల్ టెక్నాలజీల ప్రాధాన్యత దృష్టిలో పెట్టుకొని విద్యార్థులను కొత్త సామర్థ్యాలతో తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందని తెలిపారు. కార్యక్రమంలో విజ్ఞాన్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య, వైస్ చాన్సలర్ కల్నల్, ప్రొఫెసర్ పీ.నాగభూషణ్, రిజిస్ట్రార్ డాక్టర్ పీఎంవీ రావు, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక టిజెపిఎస్ కాలేజిలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో గురువారం వన మహోత్సవాన్ని పురస్కరించుకొని కళాశాల ఆవరణ మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ బివిహెచ్ కామేశ్వరశాస్త్రి మాట్లాడుతూ వన మహోత్సవం అనేది మనదేశంలో పర్యావరణ పరిరక్షణ కోసం జరుపుకునే ముఖ్యమైన పండుగని, ప్రతి ఒక్కరూ తమ బాధ్యతగా మొక్కలు నాటాలని కోరారు. మొక్కలు నాటడం వలన పచ్చదనంతో పాటు వాతావరణంలో మంచి మార్పులు వస్తాయని, ఆరోగ్యకరమైన వాయువుతో పాటు, సకాలంలో వర్షాలు, మానవాళికి త్రాగు నీరు, సాగు నీరు అందుబాటులో ఉంటాయన్నారు. కార్యక్రమం లో పిజి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ యస్.అనితాదేవి, గుంటూరు జిల్లా ఎన్ఎస్ఎస్ నోడల్ అధికారి డాక్టర్ జె.వి.సుధీర్‌కుమార్, మేనేజ్‌మెంట్ స్టడీస్ విభాగాదిపతి డాక్టర్ యు.రవికుమార్ విద్యార్థులు పాల్గొన్నారు.

వనమహోత్సవంలో అధ్యాపకులు, విద్యార్థులు